RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 13 నవంబర్ 2025 గురువారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:138

## అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.



వార్తా 3 లో

## రవాణా శాఖ లో ఎన్ఫోర్స్మెంట్ నిరంతరం ఉండేలా ప్లాన్ ఆఫ్ యాక్షన్ కఠినతరం.

మంత్రి పొన్నం ప్రభాకర్



వార్తా 2 లో

## మెడిగడ్డ,అన్నారం,సుందిళ్ళపునరుద్ధరణకు చర్యలు

-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వార్తా 2 లో

# మధ్యాహ్న భోజనం బకాయిలు 163 కోట్లు వెంటనే విడుదల చేయండి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం



ఎస్సీ, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బకాయిలు మొత్తం సుమారు 163 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన ప్రజా భవన్ లో, ఆర్థిక శాఖ అధికారులు, గురుకులాల అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ గురుకులాలు, హాస్టల్లు, ఇతర సంస్థలకు సంబంధించిన డైట్, అద్దె, కాస్మోటిక్స్ బకాయిలకు సంబంధించిన 51.36 కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్రంలోని అన్ని మైనారిటీ గురుకులాలు మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించిన డైట్, అద్దె బకాయిలు 47.61 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న 63.92 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో , వైవిధ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలన్న సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల డైట్ చార్జీలు 40%, కాస్మోటిక్ ఛార్జీలు 200 పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వహకులు నాణ్యతలో ఎక్కడ రాజీ పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తిస్థాయిలో పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించేందుకు అధికారులు నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం సందర్శించాలని సూచించారు. అధికారుల సందర్శనకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు నిర్వాహకులు నివేదించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి నగర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

## సి.ఎస్ రామకృష్ణారావు





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, నవంబర్ 12 :: ఈ నెల 16వ తేదీన ఉప రాష్ట్రపతి, 21 తేదీన రాష్ట్రపతి, హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. సంబంధిత విభాగాల అధికారులు సమన్వయం చేసుకోని, ఆయా డిపార్ట్ మెంట్ల వారీగా నోడల్ ఆఫీసర్ ను నియమించి నిబంధనల ప్రకారం తగు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టు కు చేరుకుంటారని తదనంతరం రాజ్ భవన్ లో స్వల్ప విశ్రాంతి, గవర్నర్ High Tea లో పాల్గొని, అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీ లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8.00 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి న్యూఢిల్లీకి బయలుదేరుతారని అధికారులు పేర్కొన్నారు. బ్లూ బుక్, VVIP ప్రొటోకాల్ మాన్యువల్ ప్రకారం తగు భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్త్ ప్రణాళికను పోలీస్ శాఖ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా వివిఐపిలకు తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. జి.ఎ.డి., ఫైర్ సర్వీస్, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, మున్సిపల్, ఇంధన, బి.ఎస్.ఎన్,ఎల్, హార్టి కల్చర్ విభాగాలు నిర్దేశించిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గౌరవ రాష్ట్రపతి ఈ నెల 21 తేదీన మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారని స్వల్ప విరామం కోసం రాజ్ భవన్ లో బస చేసి, అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాత్రి రాజ్ భవన్ లో బస చేసి 22వ తేదీ ఉదయం పుట్టపర్తి పర్యటనకు బయలుదేరుతారని అధికారులు పేర్కొన్నారు.

పై రెండు కార్యక్రమాలలో అన్ని సంబంధిత డిపార్టుమెంట్ అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా ప్రతి ఏర్పాటును స్వయంగా పర్యవేక్షించాలని, ప్రస్తుత పరిస్థితులల్లో భద్రతా పరంగా మరింత శ్రద్ధతో ఏర్పాట్లు చేయాలని కోరారు.

రామోజీ ఫిల్మ్ సిటీ లో కార్యక్రమ నిర్వహణకు సంబంధిత నిర్వహకులు ఉప రాష్ట్రపతి కార్యాలయం అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరారు. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రాజ్ భవన్లో ఏర్పాట్లు, సన్నద్ధతపై తగు చర్యలు తీసుకోవాలని రాజ్ భవన్ జాయింట్ సెక్రెటరీని కోరారు. మిలటరీ, ఏయిర్ పోర్టు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రెండు కార్యక్రమాలలో ప్రోటోకాల్, భద్రత ఏర్పాట్లు సజావుగా ఉండాలని, కార్యక్రమానికి ముందు రోజున ASL, ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించాలని అధికారులను కోరారు.

ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, అదనపు డిజిపిలు విజయ్ కుమార్, మహేష్ భగవత్,GHMC కమీషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ Ch. ప్రియాంక, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య, రామోజీ ఫిల్మ్ సిటీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రసవాల నిర్వహణలో నల్గొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుంది - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ: ప్రసవాల నిర్వహణలో నల్గొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుందని అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

బుధవారం మంత్రి నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ....

రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ తర్వాత ఎక్కువగా ప్రసవాలు నిర్వహించే అతిపెద్ద ఆస్పత్రిగా నల్గొండ జిజిహెచ్ పేరుపొందిందని, ప్రతినెల 700 నుండి 800 వరకు ప్రసవాలు చేయడం జరుగుతున్నదని ఆయన తెలిపారు.గతంలో ఉన్న సదరం శిబిరం కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, సౌకర్యాల లేమితో వైకల్యం కలిగిన వారు అనేక ఇబ్బందులను ఎదుర్కోవడాన్ని దృష్టిలో ఉంచుకొని 30 లక్షల రూపాయల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించి వికలాంగులకు కొత్త భవనంలో తాగునీరు, టాయిలెట్స్, ర్యాంపు,ఇతర అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. వైకల్యం కలిగిన వారు ఇక ప్రతివారం ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్లు పొందవచ్చని అన్నారు. ఇప్పటివరకు దృవపత్రాలు రాని వారికి ధ్రువపత్రాలు జారీ చేయడం జరుగుతుందని, సదరం ధ్రువ పత్రాల ఆధారంగా పెన్షన్ రాని వారికి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు ఏ ఇతర ఆస్పత్రిలో లేవని , ఆసుపత్రిలో అన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇటీవలే బేబీ వార్మ్, లాప్రోస్కోపిక్ మిషన్ వంటివి ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు, మూడు లక్షల రూపాయల విలువ చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేస్తున్నామని,ఇవి సద్వినియోగం చేసుకోవాలని కోరారు .ఇంకా ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని,అవసరమైతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామని చెప్పారు. ప్రసవాల కోసం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి రావాలని, ఇందుకు ఆశ, అంగన్వాడీ, ఆస్పత్రికి సిబ్బంది, అంబులెన్స్ వాహనాల డ్రైవర్లు, డాక్టర్లు కృషి చేయాలని మంత్రి అన్నారు. వైద్య సేవలలో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని రాష్ట్రం లోనే నంబర్ వన్ గా నిలపాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి,జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్ అరుణ కుమారి, ఆర్ఎంవో ,ఇతర అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శాఖల ప్రధాన కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి తుమ్మల

## సమయపాలన పాటించని అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు



రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకారాలు, హ్యాండ్లూమ్స్ & టెక్స్టైల్స్ శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు బుధవారం తన పరిధిలోని శాఖల ప్రధాన కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన %నూజూా%, సీడ్ సర్టిఫికేషన్ కార్పొరేషన్, సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్ & టెక్స్టైల్స్ ప్రధాన కార్యాలయాలను సందర్శించారు.

తనిఖీల సందర్భంగా సమయానికి హాజరుకాని కొంతమంది అధికారులపై మంత్రి గారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పొరుగుసేవల సిబ్బంది సమయపాలన పాటిస్తుండగా, రెగ్యులర్ ఉద్యోగులలో ముఖ్యంగా జనరల్ మేనేజర్, మేనేజర్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మంత్రి గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమయపాలనను కఠినంగా అమలు చేయాలని, విధులపట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని మంత్రి గారు హెచ్చరించారు. సమయానికి విధులకు హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల కమిషనర్లు, ఎండీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు.

ఉన్నతస్థాయి అధికారులు నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రజాసేవలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజాబలం

13 నవంబర్ 2025 గురువారం

# ఉగ్రవాదుల అడ్డగా... ఆల్ ఫలాహ్

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలిన బాంబు మనదేశంలో ఉన్న ఉగ్రవాదుల అందర్నీ పట్టిస్తోంది. ఇప్పటికే ఈ సంఘటనలో ముగ్గురు డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.. మంగళ వారం అదుపులోకి తీసుకున్న ముగ్గురు డాక్టర్లు హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఫరీదాబాద్ ప్రాంతంలోని ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు.పోలీసులు అరెస్ట్ చేసిన వైద్యులలో డాక్టర్ ముజామిల్ షకీల్, డాక్టర్ షాహిన్ షాహిద్, డాక్టర్ ఉమర్ మహమ్మద్ ఉన్నారు. ఇందులో ఉమర్, ముజామిల్ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన వారు. షహీన్ లక్నోకు చెందిన వ్యక్తి. వీరంతా కూడా ఫరీదాబాద్ ఆసుపత్రిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో పని చేస్తూ దౌజా అనే గ్రామంలో షకీల్ రెండు ఇండ్లను అద్దెకు తీసుకున్నాడు. అందులో మూడు టన్నుల పేలుడు పదార్థాలను నిల్వ చేసాడు.. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు..జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ వైట్ మాడ్యూల్ లో ఉగ్రవాదులను తయారు చేస్తోంది. డాక్టర్లను, విద్యార్థులను ఉగ్రవాదులుగా మార్చుతోంది. ఈ విభాగానికి డాక్టర్ షహీన నాయకత్వం వహిస్తున్నారు.. అందువల్లే ఆ యూనివర్సిటీలో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కాలేజీలో చదువుతున్న చాలామంది వైద్య విద్యార్థులు ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్నారని ఇంటలిజెన్స్ రిపోర్టు ఇటీవల పోలీసులకు తెలిసింది. దీంతో పోలీసులు ఈ విశ్వవిద్యాలయం పై దృష్టి సారించారు. ఫలితంగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.. ఇంటెలిజెన్స్ వర్గాలు.. నిఘా వర్గాలు ఈ విశ్వవిద్యాలయం లో చదివిన పాత విద్యార్థుల వివరాలు కూడా సేకరించాయి. అందులో కేసులు ఉన్న వారి వివరాలు కూడా పరిశీలించి.. వారి గురించి ఆరా తీస్తున్నాయి.ఈ విశ్వవిద్యాలయం వైద్యుల ఫ్యాక్టరీ మాదిరిగా ఉండేది. ఇక్కడ చదువుకున్న వారంతా దేశ విదేశాలలో స్థిరపడ్డారు. ఈ ప్రాంతానికి విశేషమైన పేరు తీసుకొచ్చారు. కానీ కొంతకాలంగా ఈ విశ్వవిద్యాలయంలో పరిస్థితి దారుణంగా మారుతోంది.. కొంతమంది వ్యక్తులు ఇక్కడ వైద్య విద్య పేరుతో ప్రవేశం పొంది దారుణమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కొంతమంది విద్యార్థులను ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టడానికి ఎంపిక చేసుకుంటున్నారు. వారి ద్వారా దారుణమైన పనులు చేయిస్తున్నారు. చివరికి వారి ప్రాణాలను గాలిలో కలిసేలా చేస్తున్నారు. ఆత్మహుతి దళాలుగా కూడా పనిచేసేలా శిక్షణ ఇస్తున్నారు. చివరికి వారి కుటుంబాలను కూడా అన్యాయం చేస్తున్నారు.పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ పై విరుచుకుపడింది. ముఖ్యంగా పాకిస్తాన్ దేశంలో ఉన్న ఉగ్రస్తావరాలపై విస్తృతంగా దాడి చేసింది.. చూస్తుండగానే పాకిస్తాన్లో ఉగ్రస్తావరాలను నేలమట్టం చేసింది. రెండవ కంటికి తెలియకుండా ఉగ్రవాదుల నివాసాలను కూడా కాలగర్భంలో కలిపేసింది. భారత్ చేసిన దాడుల వల్ల సహజంగానే పాకిస్తాన్ స్పందించింది. ఎందుకంటే పాకిస్తాన్ కు, ఉగ్రవాదులతో అవినాభావ సంబంధం ఉంది. అందువల్లే ఉగ్రవాదుల స్థావరాలు నేలమట్టమైతే పాకిస్తాన్ స్పందించింది. ఒకరకంగా శోకాలు పెట్టింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పాకిస్తాన్ దేశాన్ని మరింత ఇబ్బందికి గురిచేసే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈ క్రమంలో సింధూ నది మీద ఒక బృహత్తరమైన హైడల్ ప్రాజెక్ట్ నిర్మించాలని భావించింది. అంతేకాదు పాకిస్తాన్ దేశానికి సింధూ నది ప్రవాహాన్ని నిలిపివేసే ప్రణాళిక కూడా విజయవంతంగా అమలు చేస్తోంది. దీంతో పాకిస్తాన్ దేశంలో హాహా కారాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అక్కడి వ్యవసాయం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. చివరికి క్రికెట్ విషయంలో కూడా పాకిస్తాన్ దేశంతో ఆడేందుకు భారత్ ఒప్పుకోవడం లేదు. ద్వైపాక్షిక సిరీస్ లకు టీమిండియా ఎప్పుడో దూరమైంది. ఐసీసీ నిర్వహించే మెగా టోర్నీలో మాత్రమే టీమిండియా పాకిస్తాన్ జట్టుతో తలపడుతోంది. అది కూడా తటస్థ వేదికలలో మాత్రమే ఆడుతోంది.ఢిల్లీలో ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద కారు పేలుడుకు పాల్పడింది పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు మొదటి నుంచి కూడా అనుమానిస్తున్నాయి. ఇదే క్రమంలో జాతీయ మీడియాలో కూడా వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ గడ్డమీద కారు పేలుడుకు కారణమైన పాకిస్తాన్ ఉగ్రవాదులకు గట్టి బుద్ధి చెప్పాలని భారత్ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. భూటాన్ వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెబుతామని.. అటువంటివారిని ఎట్టి పరిస్థితుల్లో తాము ఉపేక్షించబోమని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇంగ్లీష్ లో మాట్లాడారు. ఇప్పుడు కూడా ఆయన ఇంగ్లీషులోనే మాట్లాడారు. పైగా ఉగ్రవాదులను అత్యంత కఠినంగా శిక్షిస్తామని.. వారు ఎక్కడ ఉన్నా సరే బయటికి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ ప్రకారం ఢిల్లీ దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టే అవకాశం ఉందని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్ 2.0 కనక మొదలైతే పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే ఉండదని భారత నెటిజన్లు సోషల్ మీడియాలో అభిప్రాయపడుతున్నారు.

# రవాణా శాఖ లో ఎన్ఫోర్స్మెంట్ నిరంతరం ఉండేలా ప్లాన్ ఆఫ్ యాక్షన్ కఠినతరం.

**ఎన్ఫోర్స్ మెంట్ కోసం జిల్లా స్థాయిలో 33 బృందాలు , రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్ ఏర్పాటు**

**రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా వాహన నిబంధలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠినచర్యలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాల పెనాల్టీ తో పాటు ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా చర్యలు**

**రోడ్ సేఫ్టీ మంత్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి..**

**మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి మహిళా ఆటో అనుమతులు ఇచ్చేందుకు సానుకూలత**

**రవాణా శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**





రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాల పై కఠినచర్యలు తీసుకొనేందుకు రవాణా శాఖ లో నిరంతరం ఎన్ఫోర్స్మెంట్ ఉండేలా ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ యాక్షన్ ను రూపొందించింది. ఎన్ఫోర్స్మెంట్ కఠినతరం చేయడానికి సచివాలయంలో రవాణా శాఖ ముఖ్య అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్ఫోర్స్మెంట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో 33 బృందాలు ,రాష్ట్ర స్థాయిలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రతి రోజు విధిగా ఆకస్మిక తనిఖీలు చేపట్టేలా ఆ రోజు చేయాల్సిన ఎన్ఫోర్స్మెంట్ ప్రాంతాలపై ఆయా బృందాలకు ఉదయం ఆరు గంటలకు రవాణా శాఖ ఉన్నతాధికారుల నుండి సమాచారం తెలపనున్నారు. ముఖ్యంగా ఓవర్ లోడింగ్ లారీలు , బస్సులు మినరల్ ట్రాన్స్పోర్ట్ లో సాండ్ ,ఫ్లైయాష్ , స్టోన్, బిల్డింగ్ మెటీరియల్స్ ,వాహనాల ఫిట్నెస్ , పొల్యూషన్ , చలానాలు పై ఈ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు తనిఖీలు చేయనున్నాయి. వాటికి అదనపు పెనాల్టీ తో పాటు వాహనాల సీజ్ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఒక్కో బృందంలో డిటిసి ఎంవీఐ , ఏఎంవీఐ ఇతర సిబ్బంది ఉండనున్నారు. గత నెలల్లో రద్దు చెస్ పోస్ట్ లో పని చేసిన సిబ్బందిని కూడా ఎన్ఫోర్స్మెంట్ లో చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఎన్ఫోర్స్మెంట్ బృందాలు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు , వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్ లపై వేధింపులకు గురి చేయరాదని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్ఫోర్స్మెంట్ మార్గదర్శకాల్లో ప్రధానంగా

జెటిసి (ఎన్ఫోర్స్మెంట్) రాష్ట్ర ఎన్ఫోర్స్మెంట్ స్క్వాడ్ను ఏర్పాటు చేయడానికి జిల్లాల నుండి MVI /AMVIలను నెలవారీ రొటేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీ చేయడానికి ఈ స్క్వాడ్ను ఉపయోగిస్తారు.జెటిసి–హైదరాబాద్ మరియు డిటిసిలు ప్రభుత్వ సెలవు దినాలతో సహా అన్ని సమయాల్లో కనీసం ఒక ఎన్ఫోర్స్మెంట్ బృందం రోడ్డుపై ఉండే విధంగా ఎన్ఫోర్స్మెంట్ బృందాలను మోహరించేలా చూసుకోవాలి.హైదరాబాద్లోని జెటిసి ,రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్నగర్, ఆదిలాబాద్ , సంగారెడ్డి %ణుజ%లు ప్రతి వారం కనీసం రెండుసార్లు అంతర్–రాష్ట్ర కాంట్రాక్ట్ క్యారేజ్ (%జజ%) బస్సులపై తనిఖీలు నిర్వహించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలి.ఫిట్నెస్ గడువు ముగిసిన వాహనాలు, ముఖ్యంగా భారీ వస్తువుల వాహనాలు, బస్సులు ఎల్లప్పుడూ సీజ్ చేయబడతాయి.ఓవర్ స్పీడ్ వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి..ఓవర్లోడ్ గూడ్స్ వాహనాలను ఎల్లప్పుడూ సీజ్ చేయాలి.ముఖ్యంగా సిసి బస్సులు, బహుళ ఈ–చలాన్లు/విసిఆర్లు ఉన్న భారీ వస్తువుల వాహనాలను స్వాధీనం చేసుకుంటారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే వాహనాలు, ముఖ్యంగా భారీ, మధ్య తరహా వస్తువుల వాహనాలు ప్రయాణీకుల వాహనాలు మరియు విద్యా సంస్థ బస్సులు సీజ్ చేయబడతాయి. వస్తువుల వాహనాలలో ఓవర్లోడింగ్ వాహనాలను స్వాధీనం చేసుకోవాలి .అదనపు లోడ్ను ఆఫ్లోడ్ చేయకుండా అనుమతించకూడదు.

సంబంధిత అధికారులు ప్రారంభ పాయింట్ల వద్దనే ఓవర్లోడింగ్ ముప్పును అరికట్టడానికి అమలు ప్రణాళిక వేయాలి. మైనింగ్ విభాగానికి ఓవర్లోడ్ వాహనాల వివరాలను కూడా తెలియజేస్తుంది. టిప్పర్ లు ,ఓపెన్ ట్రాలీ వాహనాలు వస్తువులు వాహనాలు దుమ్ము దులిపకుండా టార్పాలిన్తో సరిగ్గా కప్పబడనీ వాహనాలపై చర్యలు సీసీ బస్సులలో సీట్ల మార్పు, అత్యవసర నిష్క్రమణను నిరోధించడం వంటి అనధికార మార్పులు చేస్తే చర్యలు తీసుకోవాలి.ఫిట్నెస్ గడువు ముగిసిన EIBల జాబితాను సేకరించి, రోడ్లపై తిరుగుతున్నట్లు కనిపిస్తే వాటిని స్వాధీనం చేసుకోవాలి.

గత వారం చేవెళ్ల బస్సు ప్రమాదం అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల పై తీసుకున్న చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. వారం రోజుల వ్యవధిలో 2576 వాహనాల పై కేసులు నమోదు చేశారు. ఇందులో ఓవర్ లోడ్ తో వెళ్తున్న 352 లారీలు , 43 బస్సుల పై కేసులు నమోదు చేశారు.. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ లు వేగవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. రవాణా శాఖ సిబ్బందికి ప్రతి 30 మందికి ఒక బ్యాచ్ చొప్పున శిక్షణ ఇవ్వాలి. మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి మహిళా ఆటో అనుమతులు ఇచ్చేలా కార్యాచరణ తీసుకోవాలి. వచ్చే రోడ్ సేఫ్టీ మంత్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలనీ ఆదేశించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఇన్నోవేటివ్ కార్యక్రమాలు రూపొందించాలని పేర్కొన్నారు. చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్ అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రోడ్డు ప్రమాద బాధితులకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ పై అవగాహన కల్పించాలని సూచించారు.

సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి , జెటిసి లు రమేష్ , చంద్రశేఖర్ , శివలింగయ్య

# మెడిగడ్డ,అన్నారం,సుందిళ్ళ పునరుద్ధరణకు చర్యలు –మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు లోని అంతర్భాగాలు అయిన మెడిగడ్డ,సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్ ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర జలవనరుల సంఘంతో సమన్వయం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరించేందుకు సన్నాహాలు జరుపుతున్నామన్నారు.

గత ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజాధనంతో నిర్మించిన ఈ బ్యారేజ్ లను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం శాస్త్రీయ పద్దతిలో పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఇదే విషయమై రాష్ట్ర నీటిపారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.

నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా,సలహాదారు ఆడిత్యా నాథ్ దాస్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మెడిగడ్డ కూలిపోవడానికి ,సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్ లలో లీకేజ్ లకు తప్పుడు నిర్ణయాలు,సాంకేతిక లోపాలే ప్రధాన కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ,న్యాయ కమిషన్ లు స్పష్టంగా పేర్కొన్నాయని ఆయన తెలిపారు.

సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ పై కుడా ఆరోపణలు వచ్చిన నేపధ్యంలో అర్హత కలిగిన స్వతంత్ర సాంకేతిక సంస్థలను నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

కేంద్ర జలవనరుల సంఘం సూచనలను పరిగణనలోకి తీసుకుని కొత్త డిజైన్లను రూపొందించాలని నిపుణులను అదేశించామన్నారు.

ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు ఐ ఐ టి అనుబంధ కంపెనీలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు.పూణే లోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (CWPRS) ద్వారా జియో ఫిజికల్ ,హైడ్రాలిక్ టెస్ట్ లు నిర్వహించి నష్టం విలువ అంచనా వేసి పనుల పునరుద్ధరణకు అంకురార్పణ చుట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. తాజాగా కురిసిన భారీ వర్షాలతో నీరు చేరుకుందని,15 నుండి 20 రోజులలో నీరు తగ్గిన వెంటనే పరీక్షలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

అందులో భాగంగా మొదట ఐదు సంస్థలను ఎంపిక చేసి అందులో మూడింటిని ఫైనల్ చేస్తామని ఆయన తెలిపారు.

డ్యామ్ సేఫ్టీ రంగంలో అనుభవం కలిగి ఉండడంతో పాటు సాంకేతిక సంస్థలతో అనుభందం కలిగి ఉన్న సంస్థలనే ఫైనల్ చేస్తామన్నారు.

పునరుద్ధరణ వ్యయం మొత్తం ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆయా సంస్థలే భరించాల్సి ఉంటుందని ఆయాన స్పష్టం చేశారు. గడిచిన అనుభవాల దృష్ట్యా ప్రజా ఆస్తుల పరిరక్షణ నిమిత్తం నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పునరుద్ధరణ పనులు చేపట్ట బోతున్నట్లు ఆయన తెలిపారు.

డిజైన్ లోపాలు, పనుల నిర్లక్ష్యం ,ఆర్థికంగా జరిగిన అవకతవకలను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో స్పష్టం చేసిందని ఆయన గుర్తుచేశారు.

ఇదే విషయంలో విచారణ నిర్వహించిన విజిలెన్స్ శాఖా సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిందన్నారు.

అదే విదంగా ఇదే సమీక్ష సమావేశంలో సమ్మక్క–సారక్క, సీతమ్మ సాగర్,సీతారామ సాగర్,చనకా–కోరాట,దేవాదుల,చిన్న కాళేశ్వరం, ఎస్.ఎల్.బి.సి హెలిబోర్న్ సర్వే,డిండి లతో పాటు జూరాల వద్ద నిర్మించ తల పెట్టిన ప్రత్యమ్యాయ బ్రిడ్జి సింగూర్ కాలువ లైనింగ్ పనులను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు.

## అట్టహాసంగా టిడిపిగడివేముల మండల అధ్యక్షుడు దిలీప్ రెడ్డి ప్రమాణస్వీకారం

### స్థానిక సంస్థల ఎన్నికలలో అందరినీ కలుపుకొని పోయి విజయం సాధిస్తా

నంద్యాల గడివేముల మండలంలోనిబూజునూరు గ్రామం నుండి గడివేముల మండల టిడిపి కన్వీనర్ గా పంట దిలీప్ కుమార్ రెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేయడంతో బుధవారం కర్నూలు నందు ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత రెడ్డి టిడిపి సీనియర్ నాయకులు గౌరువెంకటరెడ్డి పాల్గొన్నారు అనంతరం గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం లో పదవులు పొందిన నాయకులంతా కష్టపడి పార్టీ కోసం పనిచేసే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీ జడ్పీటీసీ సర్పంచ్ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ కష్టపడి అందరిని కలుపుకొని పోయి విజయం సాధించాలని తెలిపారు ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన సంవత్సరం కాలంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని పాణ్యం పాణ్యం నియోజకవర్గ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని దీనికి మనమందరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలపాలని అన్నారు

# అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి



## నాణ్యతతో రాజీపడేది లేదు
## తేడా వచ్చిన ఉపేక్షించేదిలేదు
## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

బుధవారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం కు హెలికాప్టర్ లో 11 గంటల 30 నిముషాలకు చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సి,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు లకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్ పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సి,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ లు మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులనుమంత్రులుక్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

అనంతరం మంత్రులు మేడారం హరిత కాకతీయ హెూటల్ లో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లతో కలసి సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి, మాస్టర్ ప్లాన్ రూపకల్పన పై కూలంకషంగా సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేడారం లో కోనసాగుతున్న అభివృద్ధి పనులపై, ప్రాకారం లోపల,సివిల్ పనులు, గద్దెల ఎత్తు పెంచడం, నిర్మాణం , ప్రధాన ద్వారాలు, ఆర్చ్, 4 వాచ్ టవర్లు, ప్రాకారనికి చుట్టూ సిసి రోడ్డు పనులను సమాంతరంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. దీనికితోడుగా గ్రీనరీ, ప్లాంటేషన్ చేయాలన్నారు.

కావలసిన గ్రానైట్ వేగవంతంగా తెప్పించుకోవాలని అన్నారు.

మెన్ మెటీరియల్ పెంచి 24 గంటలు పనులు జరగాలన్నారు.

మేడారం లో రోడ్డు నిర్మాణ పనులు డివైడర్లు, ప్లాంటేషన్ తో సహా నెల రోజుల్లో పూర్తి కావాలి. మాస్టర్ ప్లాన్ లో భాగంగా మొదటి విడతలో క్యూ లైన్ షేడ్స్, 4 రోడ్డు లైన్ల విస్తరణ, టెంపర్ అభివృద్ధి, గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ 3 వేల నుండి 10 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. 19 ఎకరాలు భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి కోరిన విధంగా జంపన్నవాగు పై చెక్ డ్యామ్ ల ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులు తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. శాశ్వత బస్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించాలని, పర్యాటక శాఖ ద్వారా జంపన్నవాగు అభివృద్ధి, సుందరికరణ ప్రతిపాదనలు సిద్ధం చెయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా 4 అధునాతన పశు వదశాలల ఏర్పాటు చేయాలని తెలిపారు. మేడారం చుట్టుప్రక్కల రహదారులకు మరమ్మతులు చేయాలి. మేడారం కు వచ్చే ప్రధాన రహదారిలో ఎలాంటి అడ్డంకులు ఉండకుండా ప్రధాన రహదారిలో అక్కడక్కడ మిగిలి ఉన్న పనులతో పాటు మల్లంపల్లి బ్రిడ్జి, కటాక్షపూర్ బ్రిడ్జి పై ప్రత్యేక శ్రద్ధ చూపి డిసెంబర్ 15 లోగా పూర్తి కావాలని నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22 న వస్తామని, నిర్దేశిత ఆయా పనులు పూర్తి కావాలని అన్నారు. నాణ్యతతో రాజీపడేది లేదని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు,దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ



శాఖ కమిషనర్ ఎస్.హారీష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ పి శబరిష్, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సి హెచ్ మహేందర్ జి, (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ అండ్ బి, పి ఆర్ ఈ ఎన్ సి, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులను పూర్తి చేస్తామని, గిరిజన పూజార్ల సూచన మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు.

ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేస్తామని అన్నారు. వచ్చే రెండు వందల సంవత్సరాల కాలం పాటు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని, 25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, భవిష్యత్ లో 10 కోట్ల మంది భక్తులకు సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మేడారం మాస్టర్ ప్లాన్ పై త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఎంత డబ్బు ఖర్చు అయినా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజనుల సాంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల గద్దెల ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని, అన్ని పనులను పూర్తి చేసి రానున్న మేడారం మహా జాతరను విజయవంతం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని, గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తున్నదని వివరించారు.



చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగ గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ధేశించిన సమయంలో సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఏ. లక్ష్మణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మ వాళ్ళను దర్శించుకుని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ దేవుళ్ళ ప్రాంతాలలో గిరిజనుల సాంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, గిరిజనుల అస్తిత్వం,ఆత్మగౌరవానికి విలువలు ఇస్తూనే పనులు చేపడుతున్నట్లు , మరో వారం రోజుల్లో గా గద్దెల ప్రాంతం ఒక రూపానికి వస్తుందని వివరించారు. భక్తులు విశ్వాసం నమ్మకంతో అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తున్నారని, వారి విశ్వాసం దెబ్బ తినకుండా ఆదివాసీల అస్తిత్వం కాపాడుకుంటూ పనులు పూర్తి చేస్తామని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి అనుకున్న సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.అనంతరం సాయంత్రం 3 గంటల 40 నిమిషాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ కమిషనర్



ఎస్.హారీష్ హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్కు బయలుదేరారు.

# JEWELS OF ASAF JAHI S - the Glory of WARANGAL

## కాఫీటేబుల్ బుక్ ను ఆవిష్కరించిన సి.ఎస్. రామకృష్ణారావు





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, నవంబర్ 12 :: సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ రచించిన JEWELS OF ASAF JAHI S - the Glory of WARANGAL * అనే కాఫీ టేబుల్ బుక్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు నేడు ఆవిష్కరించారు. డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక కూడా హాజరయ్యారు. వరంగల్ నగరంలో అస్ఫజాహీల హయాంలో నిర్మితమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రం గా పాలనను చేసిన సుబేదారుల వివరాలు వారి చరిత్రతో కూడిన ఈ కాఫి టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడుతుందని సి.ఎస్ అన్నారు. పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే చారిత్రక అంశాలతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ ను వెలువరించడం అభినందనీయమని సి.ఎస్ ప్రశంసించారు.

వరంగల్ అంటే... కాకతీయుల పాలన, వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మదికి వస్తాయి. అయితే, వరంగల్ నగరంలో అడుగు పెట్టగానే కాజిపేట నుండి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజిపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగునీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఎన్నో ఉన్నాయి. వీటితోపాటు వరంగల్ కేంద్రంగా వరంగల్ సుబాహ్ గా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలోని కొన్నిప్రాంతాలు ఉండేవి. ఈ వరంగల్ సుబేదారులుగా ఎవరెవరు ఉన్నారు. వారి ప్రత్యేకతలేమిటి, ఈ విషయమై కొన్ని అరుదైన, విశేషాలతోకూడిన సమాచారంతో పాటు నిజాం నిర్మిత హెరిటేజ్ కట్టడాల ఫోటోలతో కలిపి ఈ JEWELS OF ASAF JAHI S - the Glory of WARANGAL కాఫి టేబుల్ బుక్ ఉంటుంది. ఈ పుస్తకం చరిత్ర అధ్యయన వేత్తలు, విద్యార్థులు, చరిత్రపై ఆసక్తి ఉన్న వారికి ఉపయోగపడుతుంది

# కడపలో బై పోల్..? జగన్ మాస్టర్ ప్లాన్

కడప, నవంబర్ 12, రాజీనామా చేస్తారా? పులివెందుల శాసనసభ సభ్యత్వాన్ని వదులుకుంటారా? ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈ చర్యకు దిగుతారా? తద్వారా ఉప ఎన్నికల్లో గెలిచి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని నిరూపిస్తారా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. తెలంగాణలో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ ఆత్మీయ మిత్రుడు. ఇప్పుడు ఆయన పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గట్టిగానే తలపడుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీతో నువ్వా నేనా అన్నట్టు ఫైట్ చేస్తోంది. సగం పార్లమెంట్ సగం పార్లమెంట్ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది కేసీఆర్ పార్టీ. అటువంటి పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు టానిక్ లా పనిచేసాయి. అందుకే ఏపీలో బలపడాలనుకుంటున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం అటువంటి ఉప ఎన్నికను కోరుకుంటుంది.వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికల తోనే రాజకీయ ప్రయోజనం పొందింది.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసినప్పుడు జగన్మోహన్ రెడ్డికి అండగా దాదాపు 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారు. అప్పట్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా సరే ఉప ఎన్నికల్లో సత్తా చాటింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 వరకు ఆ పార్టీకి తిరుగులేని పునాదులు వేసి ఆ ఉప ఎన్నికలు. ఇప్పుడు కూడా అటువంటి ఆలోచన చేస్తే తప్పకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్లస్ అవుతుందని సలహాదారులు సూచిస్తున్నారు.

కానీ అంత సాహసం జగన్మోహన్ రెడ్డి చేస్తారా? అన్నది అనుమానమే. టిడిపి హయాంలో జరిగిన నంద్యాల ఉప ఎన్నిక.. వైసిపి హయాంలో జరిగిన ఉప ఎన్నికలు గురించి జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు.

అధికార పార్టీని ఢీకొట్టి వెళ్లాలంటే అంత ఈజీ కాదు. పైగా కేంద్రం సంపూర్ణ సహకారం ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 స్థానాలు వచ్చాయి. అయితే అందులో రిజర్వ్ స్థానాలే అధికం. ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు జరగాలంటే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చి గెలవాలంటే రెండే నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో ఒకటి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ వైఫల్యాలను రెఫరండంగా తీసుకొని జగన్మోహన్ రెడ్డి పులివెందుల శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయవచ్చు. ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదని కారణం చూపవచ్చు. అయితే అంతటి సాహసం జగన్ చేస్తారా? అన్నది అనుమానమే. మొన్నటికి మొన్న పులివెందుల జడ్పిటిసి స్థానంలో కనీసం డిపాజిట్లు రాలేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. అధికార జులంతో టిడిపి గెలిచిందని చెబుతున్న.. జడ్పీటీసీ కే ఈ స్థాయిలో ఉంటే.. ఎమ్మెల్యేకు ఎలాంటి అధికార ప్రయోగం ఉంటుందో జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు. అందుకే ఆయన పులివెందుల శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసే సాహసం చేయరని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 స్థానాలు వచ్చాయి. ఎవరితో ఒకరికి రాజీనామా చేయించి ఉప ఎన్నికలు తెస్తే.. ఎలా ఉంటుందో నన్న ఆలోచన లేకపోలేదు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత ఉంది.

సంతృప్తి కొనసాగుతోంది. ఇటువంటి సమయంలో ఆ సాహసం చేస్తే తప్పకుండా ఇబ్బంది కరం అవుతుందని జగన్ సన్నిహితులు చెబుతున్నారు. దీంతో జగన్మోహన్ రెడ్డి సైతం ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అయితే పులివెందులలో బలంగా ఉన్నామని వైసిపి భావిస్తోంది. అందుకే అక్కడే రాజీనామా చేసి ఎన్నికలకు వెళితే బాగుంటుందన్న అభిప్రాయం వైసీపీలోనే వినిపిస్తోంది. మరి జగన్మోహన్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# ఓటింగ్ కు దూరంగా జూబ్లీ ప్రజలు

హైదరాబాద్, నవంబర్ 12, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏ బూత్‌లో కూడా రీ పోలింగ్ లేకుండా పక్కా ఏర్పాట్లతో ప్రక్రియను అధికారులు పూర్తి చేశారని వెల్లడించింది. పలు ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య కాసేపు వాగ్వాదాలు మినహా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలింగ్ ప్రక్రియ సాగింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు మినహా ఎక్కడా శ్రుతి మించిన ఘటనలు లేవు. కొన్ని బూత్‌ల వద్ద కాంగ్రెస్ నేతల అతి ఉత్సాహం కేసులకు దారి తీసింది. ఉదయం నుంచి బూత్‌ల వద్దకు చేరుకున్న ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. మధ్యాహ్నానికి విజేతపై క్లారిటీ రానుంది. ఎప్పటి మాదిరిగానే బస్తీల్లో జనం తప్ప భవంతుల్లో ఉన్న ఓటర్లు ఓటు వేసేందుకు ముందుకు రాలేదు. అందుకే మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తక్కువ పోలింగ్ శాతం నమోదు అయ్యింది. సాయంత్రం పోలింగ్ పూర్తి ముగిసే సమయానికి మొత్తం 48.24 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇందులో పురుషులు 47.59 శాతం మంది వచ్చి ఓట్లు వేయగా, మహిళలు 48.95 శాతం వేశారు. గతంతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ, అయితే ఇందులో ఇంకో కోణం ఏంటంటే, గత రెండు ఎన్నికలతో పోల్చుకుంటే కాస్త బెటర్ అన్నమాట.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 47.58 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. అంతకు ముందు ఎన్నికలు అంటే 2018లో 45.61 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. తెలంగాణ వచ్చిన జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదు అయ్యింది. 2014లో 56.85 శాతం నమోదు అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో 52.80శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఈ ఏడాది తప్ప ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ గెలుస్తూ వచ్చారు. అయితే ఆయన అకాల మరణంతో ఇక్కడ ఇప్పుడుఉపఎన్నిక అనివార్యమైంది. ఆయన తరఫున భార్య సునీత పోటీ చేస్తున్నారు. ఆయనకు పోటీగా కాంగ్రెస్ తరఫున సునీల్ యాదవ్ ఉన్నారు. దీంతో విజయం ఎవరివైపు ఉందనే ఆసక్తి నెలకొంది.

ఇక్కడ ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంది. గతంలో ఇక్కడ నుంచి పోటీ చేసిన ఎంఐఎం ఈసారి పోటీలో లేదు. వారి మద్ధతు కాంగ్రెస్‌కు ఉన్నట్టు ఆ పార్టీ నేతలు చెప్పారు. ఇప్పుడు వారి ఓట్లు ఎటు పడ్డాయో అన్న ఉత్కంఠ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల్లో ఉంది. అందుకే కచ్చితంగా గెలుపు తమవైపు ఉందనే ధీమా ఎవరిలో లేదు. గెలుస్తున్నామని మీడియా ముందు చెబుతున్నా సన్నిహితులతో మాత్రం విజయంపై డైలమాలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. అందుకే పోలింగ్ రోజుల ఆఖరి బ్యాలెట్ సురక్షితంగా ప్రాంతంలో ఉంచి లాక్ చేసే వరకు ఇరు పార్టీల నేతలు డేగకళ్లతో పరిస్థితులను గమనిస్తూ వచ్చారు. రోజుంతా ఇరు పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేతలు రెండుసార్లు ఫిర్యాదులు చేశారు. ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని, బీఆర్ఎస్ నేతలను బెదిరిస్తున్నారని బూత్‌ల్లోకి రానివ్వడం లేదని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆగడాలు శ్రుతిమించిపోయాయని బీఆర్ఎస్ అభ్యర్థి సునీత ధర్నాకే దిగారు. మొత్తానికి ఆఖరి నిమిషం వరకు పోటాపోటీగా విజయం కోసం ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేశారు.దీంతో విజయం ఎవరివైపు ఉందో అన్న ఉత్కంఠ మాత్రం 14 వరకు కొనసాగనుంది. ఒకసారి బ్యాలెట్ బాక్స్‌లు ఓపెన్ చేస్తే ఎవరి జాతకం ఏంటో తెలిపోనుంది. అంత వరకు ఎవరి ధీమా వాళ్లకు ఉంటోంది. మరోవైపు వివిధ సర్వేసంస్థలు ఈ ఎన్నికపై సర్వేలు నిర్వహించాయి. ఇందులో కొన్ని ఆయా పార్టీలకు మద్దతుగా ఉన్నందున వాటి సర్వేలను నమ్మడానికి జనం సిద్ధంగా లేదు. అందుకే 14వ తేదీ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాముఖ్యం ఉన్న సర్వేలు ఒకట్రెండు కాంగ్రెస్ విజయానికి అవకాశాలు ఉన్నాయని చెబుతుంటే, మరికొన్ని బీఆర్ఎస్ విజయం ఖాయమనే విధంగా అంచనాలు వేస్తున్నాయి.

# కొండా సురేఖ యూటర్న్



హైదరాబాద్, నవంబర్ 12, టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ గత ఏడాది చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పరువు నష్టం దావా, కోర్టుకు వరకు విషయం వెళ్లింది. ఈ విషయంపై మంత్రి కొండా సురేఖ వెనక్కి తగ్గారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. కింగ్ నాగార్జునకు, ఆయన కుటుంబంపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని, నాగార్జున కుటుంబాన్ని తక్కువ చేయాలనేది తన ఉద్దేశం కాదన్నారు. నాగార్జునను, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనేది తన ఉద్దేశం కాదని క్లారిటీ ఇచ్చారు మంత్రి కొండా సురేఖ. ఆయన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయాలని తనకు ఏమాత్రం లేదన్నారు. గతంలో తాను అనాలోచితంగా చేసిన వ్యాఖ్యలు మిమ్మల్ని బాధించి ఉంటే, అందుకు తాను చింతిస్తున్నానంటూ విచారణం వ్యక్తం చేశారు. తాను నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.గత ఏడాది అక్టోబర్ నెలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేసుకుని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఎంతో మంది టాలీవుడ్ హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. కొందరు హీరోయిన్లకు డ్రగ్స్ సైతం కేటీఆర్ అలవాటు చేశారని వ్యాఖ్యానించారు. నాగచైతన్య, సమంత విడాకులకు కేటీఆర్ కారణమన్నారు. ఫోన్ ట్యాపింగ్స్ చేసి, వారి సీక్రెట్స్, వ్యక్తిగత విషయాలు తెలుసుకుని బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపించారు. అందువల్లే సినీ జంట విడాకులు తీసుకుందని కొండా సురేఖ సంచలనానికి తెరలేపారు. కొందరు హీరోయిన్లు చిన్న వయసులో పెళ్లి చేసుకోగా, కొందరు హీరోయిన్లు తెలుగు సినీ పరిశ్రమను వదిలి వెళ్లడానికి కూడా కేటీఆర్ కారణమని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల తీవ్ర దుమారాన్ని రేపాయి. రాజకీయంగా ఆరోపణలు చేసే సమయంలో సాటి మహిళ అని చూడకుండా సమంతపై అలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటని సినీ ఇండస్ట్రీ కొండా సురేఖను తప్పుపట్టింది. చిరంజీవి సహా పలువురు సెలబ్రిటీలు నాగార్జున కుటుంబంపై, సమంతపై కొండా సురేఖ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. అయితే కొండా సురేఖ సమంతకు మాత్రంసారీ చెప్పారు. తన ఉద్దేశం ఆమెను బాధపెట్టడం కాదన్నారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని చట్టం అందరికీ సమానమేనన్నారు. రాజకీయాల కోసం కొందరి వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేసుకోవడం సరికాదని కొండా సురేఖకు హితవు పలికారు. కేసు విచారణలో భాగంగా నాగార్జున, అమల, నాగ చైతన్య విచారణకు హాజరై తమ వాదన వినిపించారు.తనపై చేసిన వ్యాఖ్యలకు కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అనంతరం కొండా సురేఖపై పరువునష్టం దావా వేశారు. సంబంధం లేని విషయాల్లో కొండా సురేఖ తనపై అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తన గౌరవానికి భంగం కలిగించాలనే లక్ష్యంతోనే, ఏ ఆధారాలు లేకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసుల్లో కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ సైతం విచారణకు హాజరయ్యారు. మహిళను కించపరిచారని, తన గౌరవానికి భంగం వాటిల్లేలా వ్యాఖ్యలు చేశారని కోర్టుకు తెలిపారు.

# డీసీసీలకు మోక్షం జాబితా రెడీ

హైదరాబాద్, నవంబర్ 12, : జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవులను ఏఐసీసీ త్వరలోనే ప్రకటించనుంది. డీసీసీ పదవుల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులకు ఒకటి, రెండు రోజుల్లో తీపి కబురు రానుంది. డీసీసీ పీఠాలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం తుది కసరత్తు చేసినప్పటికి.. తెలంగాణలో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక, ఇతర కారణాలతో ప్రకటన వాయిదా పడుతూ వస్తున్నది.పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు తీసుకుని 14 నెలలు పూర్తయింది. అయినా పాత కమిటీలతోనే నెట్టుకొస్తున్నారు. ఇక వాయిదా వేయకుండా జిల్లా కాంగ్రెస్ రథసారథులను ప్రకటించాలనే నిర్ణయానికి కాంగ్రెస్ అధిష్ఠానం వచ్చింది. పదవుల పంపకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులతోనూ పార్టీ అధిష్ఠానం పలుమార్లు చర్చించింది.ఆ తర్వాతనే ఫైనల్ జాబితాను రూపొందించినట్లుగా పార్టీ వర్గా లు చెబుతున్నాయి. అయితే గతంలో జిల్లా కు చెందిన ముఖ్య నాయకులు తమ అనుచరుల కోసం పైరవీలు చేసి.. పదవిని దక్కిం చుకునే వారు. కానీ, పార్టీ అధిష్ఠానం మాత్రం ఆ విధానానికి చెక్ పెట్టింది. ఎవరి ప్ర మేయం లేకుండానే పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. అందుకు ఏఐసీసీనే నేరుగా రంగంలోకి దిగి గతంలోఎన్నడు లేని విధంగా పరిశీలకులను నియమించింది.ఏఐసీసీ పరిశీలకులను తమకు కేటాయించిన జిల్లాలలో పర్యటించి.. క్షేత్ర స్థాయి నుంచి అభిప్రాయలు సేకరించారు. అంతే కాకుండా డీసీసీ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడే వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీసీసీ పదవుల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, యువత, మహిళలకు 50 శాతానికి పైగా అవకాశం ఇవ్వాలని నిర్ణయంతో పాటు పార్టీలో దాదాపు ఐదేళ్లుగా పనిచేసి ఉండాలని నిబంధన కూడా పెట్టిన విషయం తెలిసిందే.వీటితో పాటు ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా కొనసాగుతున్న వారికి మళ్లీ అవకాశం ఇవ్వొద్దని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఒకటి, రెండు చోట్ల ఎమ్మెల్యేలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవులు అప్పగించే అవకాశాలున్నట్లుగా తెలుస్తోంది. దీంతో చాలా మంది సీనియర్లు తమ కంటే తమకే పదవి వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో పార్టీ పరంగా డీసీసీ అధ్యక్షులే కీలకం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు నేరుగా డీసీసీ అధ్యక్షులతో మాట్లాడే అవకాశం ఉంది. అంతే కాకుండా పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ పరిస్థితితో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు డీసీసీ అధ్యక్షులే బీ ఫామ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఒక్కో జిల్లాలకు పదుల సంఖ్యలో పార్టీ పరిశీలకులకు దరఖాస్తులు చేసుకున్నారు.అయితే జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మాత్రం తమ, తమ అనుచరుల పేర్లను పరిశీలకులకు చెప్పి.. మద్దతుగా ఉండాలని క్షేత్రస్థాయిలోని పార్టీ నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చారు.

# రెండేళ్ల నుంచి దాడుల కోసం ప్రయత్నం

న్యూఢిల్లీ, నవంబర్ 12, ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో భాగంగా అరెస్ట్ అయిన డాక్టర్ షహీన్.. పోలీసుల విచారణలో సంచలన నిజాలు బయటపెట్టింది. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (ఏవఓ) సంస్థ కోసం దాదాపు రెండేళ్లుగా డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి దేశవ్యాప్తంగా బహుళ ఉగ్ర దాడులకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆమె అంగీకరించింది. మాస్టర్‌మైండ్ ఉమర్ సూచనలతోనే ఈ మాడ్యూల్ నడిచినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్‌తో షాహీన్‌కు గల కీలక లింక్ కూడా ఉన్నట్లు సమాచారం.

: దేశంలో ఉగ్రవాద కుట్రలకు పాల్పడేందుకు డాక్టర్లు, నిపుణులతో ఏర్పడిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్' వెనుక ఉన్న లోతైన కుట్రలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో భాగస్వామి అయిన డాక్టర్ షహీన్‌ను అధికారులు విచారించగా.. ఆమె విస్తుపోయే విషయాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా కుట్రల కోసం తాము రెండేళ్లుగా కష్టపడుతున్నట్లు వివరించిందిడాక్టర్ షహీన్ విచారణలో వెల్లడించిన ప్రకారం.. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ జైషే మహమ్మద్ కోసం దాదాపు రెండేళ్ల నుంచి దేశవ్యాప్తంగా పలుచోట్ల ఉగ్ర దాడులు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మాడ్యూల్‌లో కీలక వ్యక్తి అయిన ఉమర్.. ప్రతిసారీ బహుళ ఉగ్ర దాడులు చేయడం గురించి ఉద్వేగభరితంగా మాట్లాడేవాడని షాహిన్ తెలిపినట్లు సమాచారం.డాక్టర్ షహీన్.. డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి రెండేళ్లుగా అమ్మోనియం నైట్రేట్ వంటి ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు అంగీకరించింది. ఈ సేకరించిన పేలుడు పదార్థాలను ఉపయోగించేందుకు జైషే సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆమె బయటపెట్టింది. ఈ మాడ్యూల్‌తో తన సోదరుడు పర్వేజ్ సయీద్‌కు కూడా భాగస్వామ్యం ఉందని షహీన్ పేర్కొనడంతో.. జమ్మూ కాశ్మీర్ పోలీసులు వెంటనే మంగళవారం అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పర్వేజ్ వద్ద ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో.. అరెస్ట్ అవుతాననే భయంతో వాటిని దాచి ఉంచొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే దర్యాప్తు అధికారులు గురుగ్రామ్‌కు చెందిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాదారుడిని గుర్తించినట్లు సమాచారం. త్వరలోనే అతడిని కూడా అరెస్టు చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి.మరోవైపు డాక్టర్ షహీన్‌ను అధికారులు తదుపరి విచారణ కోసం శ్రీనగర్‌కు తరలించారు. ఈ అరెస్ట్ వెనుక జైషే మహమ్మద్ విస్తృత నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు బలమైన అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్న జమాత్ ఉల్ మొమినాత్ అనే విభాగంలో షహీన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి.. వారిని ఉగ్ర కార్యకలాపాలకు నియామకాలు చేపట్టడం వంటి పనులను షాహిన్ నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడి అయింది.ఇదిలాఉండగా.. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడుకు సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. పేలుడు తీవ్రతను, దాని ప్రభావాన్ని పరిశీలిస్తే.. అందులో మిలిటరీ గ్రేడ్ పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు దర్యాప్తు వర్గాలు బలంగా అనుమానిస్తున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తదుపరి విచారణలో తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# మహారాష్ట్రలో కాంగ్రెస్ ఒంటరిపోరు..

ముంబై, నవంబర్ 12, మహారాష్ట్రలో ఇండియా కూటమికి బీటలు వారుతున్నాయి! స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం కూడా ఓకే చెప్పిందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తెలిపారు. శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎంఎన్ఎస్‌ల కలయికపై కాంగ్రెస్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ నిర్ణయంపై ఇండియా కూటమి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మహారాష్ట్రలో ఇండియా కూటమికి బీటలు వారుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ తమ వ్యూహాలను మార్చుకుంటున్నట్లు సమాచారం. తాజాగా కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మహారాష్ట్ర కాంగ్రెస్.. అధిష్ఠానానికి సమాచారం కూడా ఇచ్చినట్లు తెలిపారు. దానికి అధిష్ఠానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇక ముంబైతో పాటు 246 మున్సిపల్ కౌన్సిల్స్, 42 నగర పంచాయతీల్లో ఒంటరిగా పోటీ చేస్తామన్నారు., ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, రాజ్ ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ్ నిర్మాణ్ సేన (ఎమ్ఎన్ఎస్) మధ్య ఇటీవల సాన్నిహిత్యం పెరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఎంఎన్ఎస్.. ఇండియా కూటమిలో చేరితే.. మైనారిటీ, ఉత్తరాది రాష్ట్రాల ప్రజల ఓట్లు దూరమవుతాయని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఒంటరిగా పోటీ చేసేందుకు అడుగుల ముందుకు వేస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇండియా కూటమి పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. శివసేన (ఉద్ధవ్) పార్టీ ప్రతినిధి ఆనంద్ దూబే ఘాటుగా స్పందించారు. హర్యానా, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పేలవమైన ప్రదర్శన చేసిందని గుర్తుచేశారు. ఇతర పార్టీలపై వ్యాఖ్యలు చేసేందుకు కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. శివసేన (ఉద్ధవ్) కూడా ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.మరోవైపు, ప్రత్యర్థి కూటమిలో కుంపట్లపై.. అధికార బీజేపీ ఘాటు విమర్శలు చేసింది. మహావికాస్ అఘాడీ పూర్తిగా గందరగోళంలో పడిపోయిందని బీజేపీ ఎమ్మెల్యే ప్రవీణ్ దారేకత్ ఎద్దేవా చేశారు. ఉద్ధవ్ లాగే, రాజ్ ఠాక్రే కూడా హిందుత్వ సిద్ధాంతాలకు దూరమవుతున్నారని ఆరోపించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నా.. అధికార పక్షంపై కలిసికట్టుగా పోరాడాలని కూటమి పార్టీలను కోరుతోంది కాంగ్రెస్.

ఈ మేరకు ఎన్డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత నానా పాటోల్ విమర్శలు గుప్పించారు. ముంబై, నవీ మంబై, థాణెల్లో అధికార పక్షం భూ కుంభకోణాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్డీఏ స్కామ్‌లను ఎండగట్టేందుకు శరద్ పవార్ కాంగ్రెస్‌లో చేరాలని కోరారు. ఇటీవల శరద్ పవార్, కాంగ్రెస్‌ను బలహీన పరుస్తున్నారని ఆరోపించిన నానా పాటోల్.. తాజాగా ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించడం గమనార్హం.

# తాడిపత్రిలో హై టెన్షన్

తాడిపత్రిలో హై టెన్షన్ నెలకొంది. టీడీపీ, వైసీపీ పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వైసీపీ నేత పెద్దారెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమవగా, పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పెద్దారెడ్డి కార్య క్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.

# శభాష్ రేవంత్..



హైదరాబాద్, నవంబర్ 12, ముఖ్యమంత్రి అయినంత మాత్రాన దర్బార్లో ఉండాల్సిన అవసరం లేదు. రాజమహల్ లో సకల సౌకర్యాలు అనుభవించాల్సిన పనిలేదు. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచాడు కాబట్టి.. ప్రజలకు అందుబాటులో ఉంటే సరిపోతుంది. కష్టాలను, కన్నీళ్లు తుడిచి నేను ఉన్నానని భరోసా ఇస్తే ఆ నాయకుడిని పదికాలాలపాటు ప్రజలు కంటికి రెప్పలా చూసుకుంటారు.. నవీన్ పట్నాయక్, మనోహర్ పారికర్, బుద్ధదేవ్ భట్టాచార్య.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది.. వాస్తవానికి ముఖ్యమంత్రి పీఠం అనేది అత్యంత సవాళ్లతో కూడుకున్న స్థానం. అటువంటి స్థానానికి చాలామంది వన్నె తీసుకొచ్చారు.. తన పాలనదక్షతో.. అద్భుతమైన వ్యవహార శైలితో ఆకట్టుకున్నారు.తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే కొంతమంది ముఖ్యమంత్రి గొప్ప పరిపాలన అందించి ప్రజల మన్నన పొందారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనతను కేసీఆర్ పొందారు. కెసిఆర్ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఉద్యమ సమయంలో ఆయన ఎటువంటి ధోరణి అయితే అవలంబించారో? ముఖ్యమంత్రి అయిన తర్వాత అంతకుమించి అనే స్థాయిలో ప్రజలకు దూరంగా ఉన్నారు. అయితే ప్రగతిభవన్ లేదా వ్యవసాయ క్షేత్రంలో ఉండేవారు. ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదు. కొన్ని సందర్భాలలో సొంత మంత్రులకు కూడా ఆయన అపాయింట్మెంట్ ఇచ్చేవారు కాదు. అప్పట్లో హోం శాఖ మంత్రి మహమూద్ ఆలిని కూడా ఆయన ఫామ్ హౌస్ గేట్ నుంచి బయటికి పంపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ పరిపాలన కాలంలో జరిగిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. అందువల్లే తెలంగాణ ప్రజలు మూడోసారి కెసిఆర్ నాయకత్వాన్ని నమ్మలేదు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రజలకు దూరంగా ఉన్న విధానం.. ఇతర వ్యవహారాలను పరిశీలించిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సాధ్యమైనంతవరకు ప్రజలకు దగ్గరగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారు. హంగు ఆర్భాటాలకు పెద్దగా ప్రయారిటీ ఇవ్వడం లేదు. తాజాగా ప్రజా కవి అందెశ్రీ చనిపోతే.. ఆయన పాడెను మోశారు. అంత్యక్రియల ప్రారంభం నుంచి చివరి వరకు ఆయన అక్కడే ఉన్నారు. అంతేకాదు అందెశ్రీ భార్యను ఓదార్చి అనునయించారు. తాను అండగా ఉంటానని ఆమెకు భరోసా ధైర్యం కల్పించారు. రేవంత్ చేసిన పని చివరికి గులాబీ పార్టీ నేతలకు కూడా నచ్చింది. బిజెపి నాయకులు కూడా రేవంత్ చేసిన పని పట్ల అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. పరిపాలనపరంగా.. విలేకరుల సమావేశాల్లో మాట్లాడే మాటలపరంగా రేవంత్ రెడ్డి కొంతమందికి నచ్చకపోవచ్చు. కానీ కొన్ని సందర్భాలలో ఆయన ప్రత్యర్థులకు కూడా నచ్చుతాడు. మంగళవారం చేసిన పని కూడా అటువంటిదే.

# ఎన్నికలకు వ్యవసాయ కూలీలు ముందుకు సాగని పనులు

నిజామాబాద్, నవంబర్ 12, బీహార్ రాష్ట్రంలో శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి.. ఇప్పటికే ఎన్నికలు పూర్తయ్యాయి. రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో అన్ని రాజకీయ పార్టీలలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రెండవ విడత ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు జోరుగా పాల్గొంటున్నాయి. త్వరలో రెండవ విడత ఎన్నికలు అక్కడ జరగబోతున్నాయి. నవంబర్ 14న ఫలితాలు విడుదలకానున్నాయి ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికలపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది.బీహార్ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రజలు సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఉపాధి నిమిత్తం పనులు చేస్తున్న బీహార్ ప్రజలు తమ సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే ఈసారి అక్కడ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదయిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి బీహార్ ప్రజలు ఉత్సాహాన్ని ప్రదర్శించడం ఆనందాన్ని కలిగిస్తోందని అధికారులు చెబుతున్నారు.. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎక్కడెక్కడ నుంచో సొంత ప్రాంతాలకు వచ్చారని బీహార్ ఎన్నికల అధికారులు అంటున్నారు.బీహార్ ఎన్నికలు అక్కడి రాజకీయ పార్టీలకు ఒక రకమైన పరీక్షను పెడుతుంటే.. తెలంగాణ రైతులకు మరో విధమైన ఇబ్బంది కలిగిస్తున్నాయి. వాస్తవానికి బీహార్ ఎన్నికలకు.. తెలంగాణ రైతులకు ఎటువంటి సంబంధం లేదు. అయితే బీహార్ ఎన్నికల వల్ల తెలంగాణ రైతులు ఇబ్బంది పడడానికి ఒక ప్రధానమైన కారణం ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వరి పంట కోతకు వచ్చింది. చాలా ప్రాంతాలలో రైతులు వరి కోశారు.. ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తూకం వేయడానికి కూలీలు అవసరం పడుతుంది. తెలంగాణలో ధాన్యం తూకం వేసే పనికి హమాలీలు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అందువల్లే కొంతకాలంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో హమాలీలుగా బీహార్ కూలీలు పనిచేస్తున్నారు. పైగా బీహార్ ప్రజలకు కష్టపడి పనిచేసే తత్వం అధికంగా ఉంటుంది. వారు ఎంతటి ఎండనైనా సరే తట్టుకుంటారు. అందువల్లే బీహార్ కూలీలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తుంటారు. అయితే ప్రస్తుతం శాసనసభకు ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో బీహార్ ప్రాంతానికి చెందిన హమాలీలు మొత్తం సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు.అధికారుల అంచనా ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన దాదాపు 18,000 మంది హమాలీలు దాన్యం కొనుగోలు కేంద్రాలు.. ధాన్యం మిల్లుల వద్ద పనిచేస్తుంటారు. ఓటు వేయడానికి వారు వెళ్లిపోవడంతో ధాన్యం లోడింగ్ అనేది సక్రమంగా సాగడం లేదు. దీంతో మిల్లుల వద్ద ధాన్యం నిలువలు పేరుకు పోతున్నాయి. దీనికి తోడు బీహార్ హమాలీలను అక్కడి రాజకీయ పార్టీలు ఓటుకు 5000 చొప్పున ఇచ్చి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. బీహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత హమాలీలు ఇక్కడికి వస్తేనే ధాన్యం కొనుగోలు.. అన్లోడింగ్ వేగంగా సాగుతుందని మిల్లర్లు చెబుతున్నారు.

# కనీసం పోటీ ఇవ్వలేకపోయిన కమలం సర్వేలు తేల్చి చెప్పిన నిజం

హైదరాబాద్, నవంబర్ 12, లంగాణ రాష్ట్రంలో ఎంతో ఉత్కంఠ కలిగించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు పూర్తయ్యాయి. గడిచిన కొద్దిరోజులుగా గులాబి, కషాయం, కాంగ్రెస్ పార్టీలు ఈ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేశాయి. మూడు పార్టీల కీలక నాయకులు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. గులాబీ పార్టీ అయితే సోషల్ మీడియాలో రెచ్చిపోయింది.. కాంగ్రెస్ పార్టీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.. పలు న్యూస్ చానల్స్ కు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికలో వచ్చే ఫలితాన్ని తెలంగాణ ప్రజలు ఇచ్చే రెఫరెండం అని ఆయన పేర్కొన్నారు.సుమారు నాలుగు లక్షలకు పైచిలుకు ఓటర్లు ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మంగళవారం పోలింగ్ జరిగింది.. రహమత్ నగర్ నుంచి మొదలుపెడితే బోరబండ వరకు ఎన్నికల సంఘం అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరించింది.. పోలింగ్ శాతం అధికారులు అంచనా వేసినట్టుగా నమోదు కాకపోయినప్పటికీ.. మంగళవారం పొద్దుపోయే వరకు పోలింగ్ జరిగింది. కొన్ని ప్రాంతాలలో కాంగ్రెస్, గులాబీ పార్టీ నాయకుల మధ్య గొడవలు జరిగాయి. రెండు పార్టీలకు సంబంధించిన నాయకులు పరస్పరం ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.పోలింగ్ ముగిసిన తర్వాత సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి.. ఇందులో మెజారిటీ సంస్థలు జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో గెలిచే అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఉందని స్పష్టం చేశాయి..చాణక్య స్ట్రాటజీస్ అనే సంస్థ వెల్లడించిన ఎగ్జిట్ పోల్ లో కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశాలు 46%, గులాబీ పార్టీకి గెలిచే అవకాశం 41 శాతం, భారతీయ జనతా పార్టీకి ఆరు శాతం అవకాశం ఉందని పేర్కొంది.పీపుల్స్ పల్స్ అనే సంస్థ కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశం 48%, గులాబీ పార్టీకి 41 శాతం, బిజెపికి ఆరు శాతం ఉందని తేల్చింది.స్మార్ట్ పోల్ అనే సంస్థ కాంగ్రెస్ పార్టీకి 48.2, గులాబీ పార్టీకి 42.1 శాతం , భారతీయ జనతా పార్టీకి ఆరు శాతం గెలిచే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది.నాగన్న సర్వే కాంగ్రెస్ పార్టీకి 47%, భారత రాష్ట్ర సమితికి 41 శాతం, బిజెపికి 8 శాతం గెలిచే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

# పెడన మదరసాలో ముగ్గురు బాలికలు మిస్సింగ్

విజయవవాడ పెడన15 వార్డులోని ఉర్దూ మదరసా నుండి మంగళవారం రాత్రి ముగ్గురు బాలికలు అదృశ్యం అయ్యారు. వారిలో బంటుమిల్లికి చెందిన మహమ్మద్ ఆస్మా. విజయవాడకు చెందిన షేక్ సబీహ. కాకినాడకు చెందిన షేక్ సమయ అదృశ్యం అయినట్టు మదర్సా సిబ్బంది పెడన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలికలు అదృశ్యంపై కేసు నమోదు చేసిన పెడన ఎస్సై జి సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు బాలికలు కాకినాడ చేరుకునట్టు గుర్తించారు.

# ఖాతాల్లోకి ఇందిరమ్మ ఇళ్ల డబ్బులు

మెదక్, నవంబర్ 12, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం తాజాగా రూ. 202.93 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వారం 18,247 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2,33,069 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని.. మొత్తం రూ. 2,900 కోట్ల చెల్లింపులు జరిగాయని ఆయన పేర్కొన్నారు. తమ ఇళ్ల నిర్మాణం కోసం నిధులు అందిన లబ్ధిదారులు వెంటనే బ్యాంకు ఖాతాలను తనిఖీ చేసుకుని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు మరో శుభవార్త. ప్రభుత్వం తాజాగా ఈ పథకం కింద రూ. 202.93 కోట్లను విడుదల చేసింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈ నిధులను జమ చేయడంతో.. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడానికి అవకాశం లభించింది.రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) వి.పి. గౌతమ్ ఈ నిధుల విడుదలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేశారు. లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులను ఖాతాల్లో జమ చేసే విధానం కొనసాగుతుండగా.. ఈ వారం ఒక్కరోజే 18,247 మంది లబ్ధిదారులకు నగదు జమ అయినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిధుల విడుదలలో ఆలస్యం చేయకుండా, నిర్మాణ పురోగతిని బట్టి ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తుండటం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2,33,069 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ప్రారంభమైంది. నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన మొత్తం చెల్లింపులు ఇప్పటివరకు రూ. 2,900 కోట్లు దాటాయి. ఈ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన సొంతింటిని నిర్మించుకునే అవకాశం లభిస్తోంది.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. కేవలం నిధులు విడుదల చేయడమే కాకుండా, ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాల వారీగా నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో సమీక్షించి, ఆయా జిల్లాలకు తగినంత నిధులు విడుదల చేస్తున్నారు.ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలను తనిఖీ చేసుకుని, జమ అయిన డబ్బులను ఇళ్ల నిర్మాణానికి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం పారదర్శకంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయడం వల్ల, మధ్యవర్తుల జోక్యం లేకుండా అర్హులు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. తద్వారా, రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది పేద కుటుంబాల సొంతింటి కల పూర్తిగా నెరవేరే అవకాశం ఉంది.

# ఉద్యోగుల ఖిల్లా సరంపేట తండా

నల్గొండ, నవంబర్ 12, నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట తండా.. చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. 230 మంది ఓటర్లున్న ఈ తండాలో 190 మంది ఉద్యోగులున్నారు. వీరిలో 120 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వ్యవసాయంపై ఆధారపడిన ఈ తండా, చదువు విలువను గుర్తించి, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ఉద్యోగాల దిశగా ప్రోత్సహించింది. కొన్ని కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కూడా ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉండటం నిజంగా విశేషం.ప్రభుత్వం ఉద్యోగం.. మాట వినిపిస్తే చాలా నిరుద్యోగులు ఆశగా చూస్తారు. నూటికి 90 మంది యువత ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా ఏళ్లతరబడి ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే మనం ఎంత కష్టపడ్డా.. చివరకు ఎంతో కొంత అదృష్టం లేకపోతే ఉద్యోగం రావడం కల్ల. ఒకప్పుడు ఊరిలో ఒకరో, ఇద్దరో ప్రభుత్వ ఉద్యోగులు ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. గ్రామాల్లో కూడా పదుల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు కనిపిస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తున్నారు. ఈ క్రమంలో ఓ తండా గురించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ 230 మంది ఓటర్లు ఉంటే.. సుమారు 80 శాతం మంది అంటే 190 మంది ఉద్యోగులు ఉన్నారు. మరో ఆశ్చర్యకరమైన అంశం ఏంటంటే.. వీరిలో 120 మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడం విశేషం. ఆ తండా వివరాలు..ఆ తండాలో 76 ఇళ్లు ఉండగా.. మొత్తం 230 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 190 మంది వరకు ఉద్యోగులున్నారు. వీరిలో 120 మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం.

ఇంతకు ఇది ఏ తండా అంటే.. అదే నల్గొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని సరంపేట తండా. ఒకప్పుడు ఈ తండాలో ఉండే వారికి జీవనాధారం వ్యవసాయమే. అయితే ఆ తల్లిదండ్రులకు చదువు విలువ బాగా తెలుసు. అందుకే ఎంత కష్టమైనా సరే.. తమ పిల్లలను బాగా చదివించాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే.. ఈ తండా పిల్లలు కూడా తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్తూ, చదువుకునే వారు.ఆ తర్వాత ఉన్నత విద్య కోసం మర్రిగూడ, హైదరాబాద్ వచ్చారు కొందరు. ఈక్రమంలో 1968లో తొలిసారి తండా వాసి ఒకరు ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఆయనే మూడావత్ జగారం. అతడు సర్కార్ టీచర్ ఉద్యోగం సాధించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని తండాలోని మిగతా వారు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించే దిశగా అడగులు వేశారు. అలా తండాలో ప్రతి ఏటా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం తండాలో 230 మంది ఓటర్లుంటే అందులో 120 మంది ప్రభుత్వ, 70 మంది వరకు ప్రైవేటు ఉద్యోగాలు ఉన్నారు. మిగతా వారు వ్యవసాయం, వ్యాపారాలు చేస్తున్నారు.తండాలోని కొన్ని ఇళ్లలో ఒక్కో ఇంటి నుంచి ఇద్దరు, ముగ్గురు కూడా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కొందరు పదవీ విరమణ పొందారు. తండా వాసులు.. జిల్లా స్థాయి అధికారి నుంచి నాలుగో తరగతి ఉద్యోగి వరకు.. వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

అయితే వీరంతా ప్రతి సంవత్సరం దసరా, ఇతర పండగల సందర్భాల్లో గ్రామానికి వచ్చి అంతా కలిసి సంతోషంగా పండుగ జరుపుకుంటారు. పల్లె అంటే కేవలం వ్యవసాయం మాత్రమే గుర్తొచ్చే పరిస్థితుల్లో ఈ ఊరు కొలువుల ఖిల్లాగా మారడం నిజంగా విశేషం అంటున్నారు

# తురగ పేరుతో ...మిల్లర్ల దోపిడి


నిజామాబాద్, నవంబర్ 12, రైస్ మిల్లర్లు రైతుల నిండా ముం చుతున్నారు. తరుగు పేరిట నిలువు నా... దోచేస్తున్నారు. ఆరుగాలం కష్టం చేసి పండించిన పంటను నానా సాకులు చెబుతూ అన్న దాతలను మోసం చేస్తున్నారు. ఉమ్మడి నిజాంబాద్ కామారెడ్డి జిల్లాలో రైస్ మిల్లలాగడాలు మితిమీరి పోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని తరలించినప్పటికీ కొనుగోలు చేసే పరిస్థితి లేక రైతులు అగచాట్లు పడుతున్నారు.రైస్ మిల్లర్ల పై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టినట్లు తెలు స్తోంది. అధికారుల అండదండలతోటే ఈ తతంగం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, రైస్ మిల్లర్లు రైతులను వేధించడం మాత్రం ఆపడం లేదు. ట్రేడింగ్ నాట్ ట్రేడింగ్ రైస్ మిల్లులు కామారెడ్డి జిల్లాలో కొనసాగుతున్నప్పటికీ, ట్రేడింగ్ రైస్ మిల్లులు మాత్రం ధాన్యం కొనుగోలు విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తు న్నారు.ధాన్యం తడిసిందని, వడ్ల రంగు మారిందని రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు అన్నదాతల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తరలించినప్పటికీ, వాటిని రైస్ మిల్లు లోకి ప్రవేశానికి అనుమతి ఇవ్వకుండా రోజుల తరబడి వాపోతున్నారు. బీర్కూర్, నసురుల్లాబాద్, రుద్రూర్ ప్రాంతాలకు చెందిన రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతుల పట్ల మోసపూరిత వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు కర్షకులు కంటనీరు పెడుతున్నారు.రైస్ మిల్లర్ల ఆగడాలను అరికట్టేందుకు విజిలెన్స్ అధికారులు దృష్టి సాధించినట్లు తెలుస్తుంది. రైతులను ఇబ్బంది పెడుతున్న విషయాలను పరిగణలోకి తీసుకుని మిర్రర్లు చేస్తున్న తీరుతెనులపై ఆరా తీసినట్లు సమాచారం. ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మి ల్లింగ్ అనంతరం పౌరసరఫరాల శాఖకు సరఫరా చేసేందుకు అనుమతులను జారీ చేసింది. కానీ మిల్లర్లు రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యాన్ని తామే స్వయంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ విషయంలో పలు ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అధికారులు మిల్లర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లు తమ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు మీడియాను సైతం లోబర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమాలు బయట రాకుండా మీడియాలో కథనాలు వెలువడకుండా ఉండేందుకు మీడియా ప్రతినిధులను నయానో భయానో అప్పజెప్తూ తమ దందాలు కొనసాగించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం కూడా విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లింది.విలేకరులను మచ్చిక చేసుకుని రైస్ మిల్లర్లు తమ వ్యాపారాలను ఏలాంటి అడ్డంకులు రాకుండా చూసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా బీర్కూర్, నసరులబాద్, రుద్రూర్ ప్రాంతాలకు చెందిన ట్రేడింగ్ రైస్ మిల్లుల యజమానులు పై విధంగా ప్రయత్నాలు చేస్తూ, ఇటు మీడియాను, అటు అధికారులను తలా పాపం తిల పిడకడన్న చందంగా అప్పజెప్పున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులు సైతం సహకారాన్ని అందిస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. మిల్లర్ల యజమానులపై విజిలెన్స్ అధికారులు ఎలాంటి చర్యలకు పాల్పడతారో..వేచి చూడాల్సిందే

## జెట్టక్క వెళ్ళిపో.. లక్ష్మీదేవి రా..

అదిలాబాద్, నవంబర్ 12, ఇంటిలో ఉన్న కీడు.. ఊర్లో ఉన్న కీడు అంతా వెళ్లిపోవాలి... జెట్టక్క వెళ్ళిపో.. జెట్టక్క వెళ్ళిపో.. లక్ష్మీదేవి రా.. లక్ష్మీదేవి రా.. ఏంటి.. వింటుంటే వింతగా అనిపిస్తుంది కదూ..! అవును ఇది నిజమే... ఇలా నిర్మల్ జిల్లాలో ఖానాపూర్ గ్రామస్తులు మొత్తం ఊరంతా చిన్న పెద్దలతో కలిసి పాత దుస్తులు వేసుకొని, పాత చీపుర్లు, చాటలతో ఒకరినొకరు కొట్టుకుంటూ ఊరి పొలిమేర్ల వరకు వెళ్ళారు.అందరూ కలిసి ఈ పాత వస్తువులతో.. జెట్టక్క వెళ్లిపో.. లక్షిదేవి రా.. అంటూ కేకలు వేస్తూ నృత్యాలు చేస్తూ.. ఊరి పొలిమేర వరకు వెళ్ళి వాటిని అక్కడే ఊరి పొలిమేరలో పడేశారు. అయితే ఇలా ఎందుకు చేస్తారంటే..? గ్రామానికి పట్టిన కీడు అంటే తెలంగాణ భాషలో కీడు ను జెట్ట చేస్తూ అంటుంటారు. అలా సంప్రదాయంగా జెట్టక్క అంటారు. అయితే గ్రామంలో ఉంటున్న అందరి ఇళ్లలోని కీడు, గ్రామం మొత్తం కీడు అంతా వెళ్ళిపోవాలి... జెట్టక్క తొలగిపోయి ఏడాదంతా ప్రజలంతా సుఖ శాంతులతో జీవిస్తారని, దీర్ఘ కాలిక సమస్యలకు తావుండదని ఈ వింత ఆచారం పలు గ్రామాల్లోనూ కొనసాగిస్తున్నారు.

## హిందువులు తీవ్రవాదులా

రాజన్న సిరిసిల్ల వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో తాత్కాలికంగా భక్తుల దర్శనాలు నిలిపివేత పై బిజేపి నిరసన, ఆందోళనకు దిగింది. ఆలయ విస్తరణ పనులపై దేవాదాయశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సరైన క్లారిటీ ఇవ్వడం లేదని బిజెపి నాయకులు ప్రతాప రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేసారు. ఏడాదికాలంగా దేవాలయ విస్తరణ పై ఎపిసోడ్ నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేసారు. రాత్రికి రాత్రి పోలీస్ బందోబస్తు పెట్టి రేకులతో ఫెన్సింగ్ పెట్టి రాజన్న ఆలయాన్ని మూసివేయడంపై మండిపడ్డారు. హిందువులు ఉగ్రవాదులా, తీవ్రవాదులా అంటూ రామకృష్ణ ప్రశ్నించారు. సమ్మక్క జాతర సందర్భంగా వేములవాడ కు వచ్చే భక్తులకు ఆటంకాలు కలిగించకుండా దర్శనాలు కల్పించాలని డిమాండ్ చేసారు.



# ఎమ్మెల్సీ కవిత భారీ కటౌట్ సహా ఫ్లెక్సీలు బ్యానర్లు తొలగింపు

నల్గోండ బుధవారం నాడు నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటన ఉంది. ఉదయం దర్వేశ్పురం ఎల్లమ్మ ఆలయంలో పూజలు అనంతరం.. నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి రానున్నారు. హాస్పిటల్ లో మౌలిక సదుపాయాల కల్పన పరిశీలించి.. రోగులతో స్వయంగా మాట్లాడనున్నారు. అయితే.. కవిత రాక సందర్భంగా.. పట్టణంలో ఏర్పాటుచేసిన భారీ హోర్డింగ్ ను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చేశారు. అనంతరం.. టౌన్ లో రోడ్ల మధ్యన కేర్ స్తంభాలకు పెట్టిన ఫ్లెక్సీలు, బ్యానర్లు మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈరోజు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ లోని క్యాంప్ ఆఫీస్ కి రానున్నారు. స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం.. ధాన్యం కొనుగోలు మీద అధికారులతో రివ్యూ చేయనున్నారు. మంత్రి రాక సందర్భంగానే పట్టణంలోని కవిత బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించినట్టు జాగృతి నేతలు ఆరోపిస్తున్నారు..



## రెండు రోజుల్లో పెళ్లి యువకుడు ఆత్మహత్య

నిజామాబాద్ ఎడపల్లి మండలం మంగళ పహాడ్ లో విషాదం నెలకొంది. ఈ నెల 13 న పెళ్లి కావాల్సిన పెళ్లి కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాప్ గౌడ్ చెట్టుకు ఉరివేసుకున్నాడు. కుటుంబకలహాలే కారణమని బంధువులు అంటున్నారు. ప్రతాప్ కు నస్రుల్లా బాద్ కు చెందిన యువతి తో పెళ్లి నిశ్చయం చేసారు పెద్దలు. పెళ్లి కొడుకు ఆత్మహత్య తో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

# విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

**విద్యతోపాటు సమాజ సేవ అభినవ్ హై స్కూల్ ప్రత్యేకత**

**అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు**

**అలరించిన కూతురు.కృష్ణమూర్తి మిమిక్రీ ఆర్టిస్ట్.**

**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం)** విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు అన్నారు ఖమ్మంలోని పంపింగ్ వెల్ రోడ్ లోని అభినవ్ హై స్కూల్ స్కూల్లో










జరిగిన ఆహార ధాన్యాలు వితరణ కార్యక్రమం సందర్భంగా జరిగిన విద్యార్థులో మాట్లాడారు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం నగరంలో అభినవ్ స్కూల్ కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, విద్యతోపాటు సమాజ సేవ పట్ల విద్యార్థులను చైతన్యం చేసే విధంగా వీరి బోధన సాగుతుందన్నారు.గతంలో ఈ స్కూల్ విద్యార్థులు పలుమార్లు అన్నం ఫౌండేషన్ కు విరాళాలు అందించడం ఎప్పటికీ మరువలేనన్నారు. చిన్న వయసులోనే సేవా కార్యక్రమాల పట్ల వారి దృష్టి మళ్లించడంలో, ఆ దిశగా విద్యార్థులను చైతన్యం చేయడంలో పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఇదే సేవా దృక్పథాన్ని విద్యార్థులు భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద పడుతుందని, ఆ విధంగా విద్యార్థులను మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో ఈ పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అందరికీ ఆదర్శం అన్నారు. అభినవ్ స్కూల్ యాజమాన్యం పారుపల్లి రమణ కరస్పాండెంట్ అరుణ కుమారి మాట్లాడుతూ తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు పాఠశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు, విపత్తుల సమయంలో నిరాశ్రయులకు అండగా నిలిచేందుకు విరాళాల సేకరణ, అభాగ్యులను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు ఇలా ప్రతి కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు ముందు వరుసలో ఉంటారని అన్నారు ఇదే ఒరవడిని భవిష్యత్తులను కొనసాగిస్తామని తెలిపారు. ఒకవైపు చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడంలోనూ తమ విద్యార్థులు అగ్ర స్థానంలో ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ కూతురు.కృష్ణమూర్తి విద్యార్థుల ముందు తన మిమిక్రీతో అలరించారు. విరివిగా పెద్ద సంఖ్యలో ఆహార ధాన్యాలు, సరుకులు సహకారం ఇచ్చన స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు అభినవ్ హై స్కూల్ కరస్పాండెంట్ పారుపల్లి అరుణ కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి







సంగారెడ్డి సదాశివపేట పట్టణ బైపాస్ రోడ్డు పై కారు ప్రమాదం లో ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమం గా వుంది. మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. కారు బొంబాయి నుండి హైదరాబాద్ వస్తుంది. గుర్తు తెలియని ముందు వాహనాన్ని కారు ఢీకొట్టినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో వినూత్న ఆలోచనతో కోతులకు చెక్

**పంచాయితీ వర్కర్ ప్రతిరోజు ఎలుగుబంటి వేషధారణలో గ్రామంలో పర్యటన**

**ఎలుగుబంటి వేషాధారణకు బయపడి పారిపోయిన కోతులు**

వేములవాడఇందు గలదు, అందు లేదని సందేహం వలదు అన్న చందంగా కోతులు బెడద ప్రతి గ్రామంలో ఉంది. పలుచోట్ల దాడులు చేస్తు ప్రజలను గాయపరుస్తున్నాయి. అదేవిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం వట్టెంల గ్రామంలో కోతుల బెడద ఎక్కువయింది. ఇళ్లలోకి చొరబడడం, ప్రజలపై దాడులు చేయడం, పిల్లలు బడికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. పిల్లలు స్కూల్లో మధ్యాహ్నం భోజనం సమయంలో కోతులు ఎగబడి గాయపరిచిన పరిస్థితులు ఉన్నాయి. కోతుల బెడదతో భయాందోళన చెందిన గ్రామస్తులకు ఉపశమనం కల్పించేలా గ్రామ కార్యదర్శి కృష్ణమోహన్ వినూత్న ఆలోచన చేశాడు. ఎలుగుబంటి వేషధారణతో కోతులకు చెక్ పెట్టాడు. స్కూల్లో మధ్యాహ్న భోజన సమయంలో ఎలుగుబంటి వేషాధారణతో తిష్ట వేయడంతో కోతులు అటువైపు రావడానికి భయపడ్డాయి. గ్రామ పంచాయతీ వర్కర్ కు ఎలుగుబంటి వేషాధారణ డ్రెస్ వేసుకుని ఊరంతా తరగడంతో వానరాలు గ్రామం వీడి వనం బాట పట్టాయి. ఎలుగుబంటి వేషాధారణకు భయపడి కోతులు ఊరికి దూరంగా పారిపోయాయి. స్కూల్ వైపు, గ్రామం వైపు కోతులు రావడం మానేశాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు పంచాయతీ కార్యదర్శి ఆలోచనను అభినందిస్తున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా కావడంతో వాటికి చిక్ పెట్టేందుకు చింపాంజి డ్రెస్ కొనుక్కొచ్చి గ్రామపంచాయతీ వర్కర్ కు వేసి గ్రామంలో తిప్పుతున్నామని కార్యదర్శి తెలిపారు.

# బావపై కత్తితో దాడి



సికింద్రాబాద్.. బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధి సంచారపురి కాలనీలో నిన్న రాత్రి సయ్యద్ జునైద్ అనే వ్యక్తిపై సమీప బంధువులు హత్యాయత్నం చేశారు.కుటుంబ కలహాలతో సొంత బావపై అతని బామ్మర్ది సోహైల్, అతిహ్, రఫీక్ ఖాద్రి లు కత్తులతో దాడికి పాల్పడ్డారు. రాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి విచక్షణారహితంగా కత్తులతో దాడికి పాల్పడడంతో సయ్యద్ జునైద్ మెడపై తీవ్ర గాయాలు కాగా అతన్ని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జునైద్ తన భార్యను తరచూ వేదింపులు, ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నాడన్న కోపంతోనే దాడికి పాల్పడినట్లు దాడి చేసిన వారు పోలీసులు ఎదుట ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా వేధింపులు ఎక్కువ కావడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై జునైద్ మాట్లాడుతూ తనపై అక్రమంగా వరకట్న వేధింపుల కేసు పెట్టి తనను తన కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. తనతో పాటు తన కుటుంబ సభ్యులను హత మారుస్తామని హెచ్చరిస్తూ పక్క ప్రణాళిక ప్రకారమే తనపై దాడికి పాల్పడ్డారని అన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన బోయిన్ పల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలు నమోదయ్యాయి.

# పులి సంచారం కలకలం





అదిలాబాద్ సిరికొండ మండలం సాత్ మె?రి గ్రామంలో పులి ఆవుపై దాడి చేసి చంపివేసింది. సమాచారం అందుకున్న ఆటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పులి ఆనవాళ్లను పరిశీలించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## వాయిసెస్ ఆఫ్ జాయ్ వేడుకలు

హైదరాబాద్ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ రావూస్ ఇఎన్ కోక్లీయర్ ఇంప్లాంట్ సెంటర్ 'వాయిసెస్ ఆఫ్ జాయ్' పేరుతో స్ఫూర్తిదాయక వేడుకను నిర్వహించింది. వినికిడి కోల్పోయి మళ్లీ ధ్వనిని వినగలుగుతున్న 200 మందికి పైగా చిన్నారుల విజయ గాథలు ఈ వేడుకలో ప్రతిధ్వనించాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని హాజరై పిల్లల ఉత్సాహాన్ని, బృందం అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ రావు మాట్లాడుతూ.. తాము శస్త్రచికిత్సలు చేయడం మాత్రమే కాదు, వారిలో తిరిగి ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా చిన్నారుల ర్యాంప్ వాక్, సంగీతం, నృత్యాలు విశేషంగా అలరించాయి. అంతేకాకుండా పిల్లల జీవితాలను మార్చిన కోక్లియర్ ఇంప్లాంట్ ప్రయాణాన్ని చూపిస్తూ ఒక చిన్న డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ప్రారంభ వినికిడి జోక్యం ప్రాధాన్యతను చాటి చెప్పిన ఈ కార్యక్రమం, వైద్య సేవలకు మించిన మానవీయ భావాన్ని ప్రతిబింబించింది. డాక్టర్ రావూస్ ఇఎన్టి ఐదేళ్లలోపు పిల్లలకు ఉచిత కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలతో ప్రతి చిన్నారికీ ఒక స్వరం' అనే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తుంది.

# వైఎస్ జగన్ బ్యాక్ స్టెప్...



విజయవాడ, నవంబర్ 12, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సీబీఐ కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యక్తిగత మినహాయింపు కోరుతూ జగన్ సీబీఐ కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాంపల్లి సీబీఐ కోర్టు వైఎస్ జగన్ పిటిషన్ విచారించి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం తెలపటంతో వైఎస్ జగన్ కోర్టు ఎదుట హాజరు కానున్నట్లు సమాచారం. ఆయన తరుపు న్యాయవాదులు వారం రోజులు సమయం కోరగా.. నవంబర్ 21వ తేదీ వరకూ సీబీఐ కోర్టు సమయం ఇచ్చింది.మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీబీఐ కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కానున్నారు. నవంబర్ 21లోగా నాంపల్లిలోని సీబీఐ కోర్టులో వైఎస్ జగన్ వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు వైఎస్ జగన్ సీబీఐ కోర్టుకు తెలియజేశారు. వైఎస్ జగన్ ఇటీవల యూరప్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే యూరప్ పర్యటన పూర్తై వచ్చిన తర్వాత నవంబర్ 14వ తేదీలోగా కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సీబీఐ కోర్టు వైఎస్ జగన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలంటూ వైఎస్ జగన్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సీబీఐ కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే వైఎస్ జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం తెలుపుతూ కౌంటర్ దాఖలు చేసింది.దీంతో కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు వారం రోజులు సమయం ఇవ్వాలని వైఎస్ జగన్ తరుపున ఆయన న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో నవంబర్ 21 వరకు సమయం ఇస్తూ సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆలోపు వైఎస్ జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అక్టోబర్ నెలలో వైఎస్ జగన్ లండన్ పర్యటనకు వెళ్లారు. లండన్ పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ అంతకుముందే సీబీఐ కోర్టును కోరారు. ఈ వినతిని పరిశీలించిన సీబీఐ కోర్టు.. షరతులతో జగన్ లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చింది. పర్యటన పూర్తైన తర్వాత నవంబర్14వ తేదీలోగా వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది.అయితే లండన్ పర్యటన నుంచి వచ్చిన అనంతరం వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ జగన్ కోర్టులో పిటిషన్ వేశారు. తాను కోర్టుకు హాజరయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని.. ఇది ప్రభుత్వ యంత్రాంగానికి భారమని పిటిషన్‌లో జగన్ పేర్కొన్నారు. వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ వేశారు.వైఎస్ జగన్ పిటిషన్ మీద విచారణ జరిపిన సీబీఐ కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే వైఎస్ జగన్ అభ్యర్థనపై కేంద్ర దర్యాప్తు సంస్థ అభ్యంతరాలు తెలియజేయటంతో.. వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు వారం రోజులు గడువు కావాలని జగన్ తరుపు న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో నవంబర్ 21వ తేదీ వరకూ గడువు ఇస్తూ సీబీఐ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది . మరి నవంబర్ 21లోపు వైఎస్ జగన్ సీబీఐ కోర్టులో హాజరవుతారా లేదా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# నాలుగున్నర గంటల్లో తిరుపతి

విజయవాడ, నవంబర్ 12, ఆంధ్రప్రదేశ్‌కు రైల్వేశాఖ శుభవార్త అందించింది. ఏపీలో మరో వందే భారత్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ నెలాఖరు నుంచి విజయవాడ బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి ఇప్పటికే షెడ్యూల్, రూట్ మ్యాప్ ఖరారు చేశారు. ఈ రైలు వారంలో మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. అలాగే ఈ రైలు అందుబాటులోకి వస్తే విజయవాడ నుంచి తిరుపతికి కేవలం నాలుగున్నర గంటల్లో చేరుకోవచ్చని రైల్వే అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి త్వరలోనే మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రానుంది. రైల్వే శాఖఏపీకి మరో వందే భారత్ రైలును మంజూరు చేసింది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న విజయవాడ?బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నవంబర్ నెలాఖరుకు పట్టాలు ఎక్కనుంది. విజయవాడ బెంగళూరు వందే భారత్ రైలుకు సంబంధించిన.. రూట్ మ్యాప్, షెడ్యూల్ రైల్వేశాఖ తాజాగా ఖరారు చేసింది. విజయవాడ – బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు.. మంగళవారం మినహా వారంలో అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. ఈ వందేభారత్ రైలు ద్వారావిజయవాడ నుంచి బెంగళూరుకు 9 గంటల్లోపేచేరుకోవచ్చు. విజయవాడ బెంగళూరు వందే భారత్ రైలుకు తెనాలి, ఒంగోలు, నెల్లూరు రైల్వేస్టేషన్, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, కృష్ణరాజపురం రైల్వేస్టేషన్‌లలో హాల్ట్ సౌకర్యం కల్పించారు.మరోవైపు విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో మొత్తం 8 బోగీలు ఉంటాయి. 7 ఏసీ చైర్‌కార్ బోగీలు ఉంటే.. ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ బోగీ ఉంటుంది. విజయవాడ బెంగళూరు వందేభారత్ రైలు 20711 నంబరుతో అందుబాటులో ఉంటుంది. ఈ రైలు ప్రతి రోజూ ఉదయం 5 గంటల 15 నిమిషాలకు విజయవాడలోబయలుదేరుతుంది. మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషాలకు బెంగళూరు రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. 20712 నంబరుతో బెంగళూరు విజయవాడ వందేభారత్ రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. బెంగళూరు విజయవాడ వందేభారత్ రైలు.. బెంగళూరులో మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాలకు బయల్దేరుతుంది. రాత్రి 11.45 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది.మరోవైపు విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తే తిరుపతికి వెళ్లేవారికి సౌకర్యంగా ఉంటుంది. ముఖ్యంగా విజయవాడ వైపు నుంచి తిరుపతి వెళ్లేవారికి ఈ రైలు అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. విజయవాడ బెంగళూరు వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే.. కేవలం నాలుగున్నర గంటల్లోనే విజయవాడ నుంచి తిరుపతికి చేరుకోవచ్చు. అయితే ముందే చెప్పుకున్నట్లుగా ఈ రైలు మంగళవారం మినహా వారంలో మిగతా అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరితే.. ఉదయం 9.45గంటల సమయానికి తిరుపతి రైల్వేస్టేషన్ చేరుకోవచ్చు.ఇక బెంగళూరు విజయవాడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు.. సాయంత్రం 6.55గంటల సమయానికి తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. రాత్రి 11 గంటల 45 నిమిషాలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకోవచ్చు.మరోవైపు విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు ఇప్పటి వరకూ కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉంది. ఈ రైలు వారంలో కేవలం మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తే.. ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కోటలో కోటరీ...

కడప నవంబర్ 12 వైసీపీ అధినేత వైఎస్ జగన్ కోటరీ నుంచి బయటకు రాలేదని పిస్తుంది. కేవలం పదకొండు సీట్లకే పరిమితమయినప్పటికీ జగన్ మాత్రం అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన తీరునే అవలంబిస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. ఏ నిర్ణయం తీసుకున్నా తప్పని సరి పరిస్థితుల్లో అమాత్యుల నుంచి నేతల వరకూ తలూపి ఉండవచ్చు. పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి కోఆర్డినేటర్ల నియామకం నుంచి నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాల వరకూ ఏ మాత్రం పరిష్కారానికి జగన్ చొరవ చూపలేదు.అది కూడా వైసీపీ ఓటమికి ఒక కారణమని చెప్పక తప్పదు. కేవలం కోటరీ నేతల నివేదికలపైనే ఆధారపడి పార్టీని నడిపారు. ఒక రకంగా పార్టీని అసలు పూర్తిగా పట్టించుకోలేదు. తాను ప్రభుత్వంలో ఉన్న ఐదేళ్ల పాటు మళ్లీ అధికారంలోకి తనవల్లే రావాలని అనేక సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్లారు. కానీ ఆ ప్రయోగం బూమ్ రాంగ్ అయింది. అధికారం కోల్పోయిన తర్వాత ఆయనలో మార్పు వస్తుందని భావించిన నేతలకు నిరాశే ఎదురవుతుంది. ఎందుకంటే రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేతలకు, ద్వితీయ శ్రేణి నేతలకు మధ్య గ్యాప్ ఇంకా కొనసాగుతుంది. వాటిని పరిష్కరించేందుకు మాత్రం జగన్ చొరవ చూపడం లేదు. కనీసం జిల్లాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి ముఖ్య నేతలను పక్కన పెట్టి ద్వితీయ శ్రేణి నేతల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదుఇప్పటికీ కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొందరి ఆధిపత్యమే పార్టీలో నడుస్తుంది. పార్టీకేంద్ర కార్యాలయంలోనూ కోటరీ పెత్తనం ఇంకా కనిపిస్తుంది. ఇప్పటికీ జగన్ వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదన్న అభిప్రాయం వినిపిస్తుంది. దీంతో నేతలు కూడా జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చినప్పటికీ నేతలు వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయడంలేదు. వచ్చినా కోటరీ అడ్డుకుంటుందని భావించి వారు తమ నియోజకవర్గాల్లో మౌనంగా ఉన్నారు. ఇప్పటికైనా జగన్ సరైన నిర్ణయం తీసుకోకుంటే పార్టీ ఎదుగుదల అనేది జరగదన్నది సుస్పష్టం.

## టారిఫ్ లతగ్గింపు దిశగా అడుగులు

న్యూఢిల్లీ నవంబర్ 12, (న్యూస్ పల్స్) ఇండియాతో వాణిజ్య ఒప్పందం త్వరలో కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. భారత వస్తువులపై టారిఫ్‌లు తగ్గిస్తామన్నారు. డొనాల్డ్ ట్రంప్ మంగళవారం అమెరికాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందం త్వరలో ఉంటుందని ప్రకటించారు. భారత వస్తువులపై విధించిన టారిఫ్ రేట్లను “చాలా త్వరలో” తగ్గించనున్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు వారు నన్ను ప్రేమించడం లేదు. కానీ మళ్లీ మమ్మల్ని ప్రేమిస్తారు” అని ఇండియాను ఉద్దేశించి ట్రంప్ ఆసక్తికరంగా మాట్లాడారు. “ న్యాయమైన ఒప్పందంపై చర్చలు జరుపుతున్నామని... అందరికీ లాభదాయకమైన ఒప్పందంపై చర్చిస్తున్నామని.. చాలా దగ్గరలో డీల్ కుదురుతుందని” ట్రంప్ చెప్పారు. భారతదేశం రష్యన్ ఆయిల్ దిగుమతులను తగ్గించడంతో అమెరికా అనుకూలంగా మారింది. “భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను చాలా తగ్గించింది. ఇది మా ఒప్పందానికి సహాయపడుతోంది” అని ట్రంప్ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో “ అద్భుతమైన స్నేహం “ ఉందని ట్రంప్ చెబుతున్నారు. ట్రేడ్ డీల్ 2025 చివరి నాటికి కుదిరే అవకాశం ఉందని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ ప్రకటనతో భారత–అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత బలపడనున్నాయని వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జనవరి 2025 నుంచి అమెరికా విదేశీ వాణిజ్య భాగస్వాములపై టారిఫ్‌లను పెంచే విధానాన్ని ప్రవేశపెట్టారు. భారతదేశంపై టారిఫ్‌లు విధించారు, ఇది భారత వస్తువుల ఎగుమతులకు సమస్యగా మారింది. ఇటీవల భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను 30% తగ్గించడంతో, అమెరికా దానికి ప్రతిస్పందనగా టారిఫ్‌లు తగ్గించే అవకాశం ఏర్పడింది. గతంలోనే ట్రేడ్ డీల్ వైపు చాలా సార్లు చర్చలు జరిగినా.. కొన్ని అంశాల్లో స్పష్టత రాకపోవడంతో ... ఎప్పటికప్పుడు ఆగిపోతూ వచ్చింది.

# కంటికి కునుకు లేకుండా చేస్తున్న 22ఏ

కాకినాడ, నవంబర్ 12 ఆంధ్రప్రదేశ్‌లో 22ం సమస్య లక్షల మంది ఏపీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 1977లో అమలు చేసిన ఏపీ అసైన్డ్ ల్యాండ్ చట్టం కింద పేదలు, భూమి లేని కుటుంబాలకు కేటాయించిన 35.4 లక్ష ఎకరాల భూములు ఇప్పటికీ వివాదాల్లోనే ఉన్నాయి. ఈ భూములు రిజిస్ట్రేషన్ చేయకుండా, ట్రాన్స్‌ఫర్ చేయకుండా 22ం లిస్ట్‌లో ఉంచడం వల్ల లక్షలాది మంది రైతులు, కుటుంబాలు ఆర్థిక నష్టాలు, సామాజిక అస్థిరత్వానికి గురవుతున్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం పరిష్కారాలు ప్రకటించినప్పటికీ, మార్చి 2025 నుంచి జూన్ 2026 వరకు విస్తరించిన ఆలస్యం ప్రజల అసంతృప్తిని పెంచుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 22ం భూముల సమస్యలు అసైన్డ్ చట్టం అమలు తీరుతో ప్రారంభమయ్యాయి. ఈ చట్టం ప్రకారం, ్రూఅ/్రూ, ఃఅ, మైనారిటీలు, భూమిలేని పేదలకు కేటాయించిన భూములను ట్రాన్స్‌ఫర్ చేయకూడదని నిబంధనలు విధించారు. ఈ భూములు ‘ప్రొటెక్టెడ్’ గా ఉండాలని ఉద్దేశ్యం. కానీ భూములు పొందిన అనేక మంది వాటిని అమ్ముకోవడం, బదలాయించడం చేశారు. అలాగే రికార్డుల ఫ్రాడ్ వల్ల డాటెడ్ ల్యాండ్స్ గా మారాయి. వైఎస్‌ఆర్సీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లుగా 22ంను అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో సమస్య తీవ్రం అయింది. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి కాలనీ.. ప్రతి భూమిపై 22జీ అమలు చేశారు. కొన్ని చోట్ల ఆయా కాలనీల వాసుల వద్ద ప్రభుత్వం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసింది. అంటే..అధికారికంగా అమ్మేసింది. గుంటూరులోని నల్లకుంటగా పిలిచే లక్ష్మీరఘురామయ్య నగర్ ఒకప్పుడు పేదలకు ప్రభుత్వం చిన్న చిన్న స్థలాల రూపంలో ఇచ్చింది. తర్వాత వాటిని నామినల్ ధరకు వారికి అమ్మకపు రిజిస్ట్రేషన్ చేసింది.కానీ వైసీపీ హయాంలో ఈ కాలనీని కూడా 22జీ కిందకు తెచ్చారు. ఈ కారణంగా ప్రజలు ఆస్తి ఉన్నా..దాన్ని బదలాయించుకోలేకపోతున్నారు. అదే సమయంలో రాజకీయకక్షలు తీర్చుకోవడానికి కూడా ఈ చట్టాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే తమకు కావాల్సిన భూములకు మాత్రం ఫ్రీహోల్డ్ ఇచ్చి భూముల్ని కొట్టేసే కుట్ర చేశారన్న ఆరోపణలు రావడంతో 2024లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వా 20 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్ ఫ్రీజ్ విధించారు. మొత్తం అవకతవకలపై విచారణ జరుపుతున్నారు. ఈ సమస్యలు రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలను బాధిస్తున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో లక్షలాది అప్లికేషన్లు అఅఒం కు వచ్చాయి. ్రూఅ/్రూ కమ్యూనిటీలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు, ఎందుకంటే ఈ భూములు వారి జీవనాధారం. 2025 జూలైలో రిజిస్ట్రేషన్ ఫ్రీజ్ రెండో సంవత్సరంలోకి ప్రవేశించడంతో సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తూ అలసిపోతున్నారు. ప్రస్తుత రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ జనవరి 2025లో 22ం బ్యాన్ లిఫ్ట్ చేస్తామని ప్రకటించారు. డిస్ట్రిక్ట్ కలెక్టర్లకు మూడు రోజుల్లో రిపోర్ట్ సమర్పించమని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 25, 2025న మంత్రి “ప్రైవేట్ ల్యాండ్స్‌ను 22ం లిస్ట్ నుంచి తొలగించమని” కలెక్టర్లకు సూచించారు. యాక్ట్‌లో అప్పీల్ అథారిటీని ఆర్డీఎలకు మార్చి, డిస్ప్యూట్ రిసాల్వ్ చేయడానికి వేగం తీసుకురావాలని చెప్పారు. తర్వాత డిస్ట్రిక్ట్–లెవల్ అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 16, 2025లో మార్చి నుంచి మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రామిస్ చేశారు. కానీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. భూ సమస్యల పరిష్కారం అంత తేలిక కాదు. కానీ పరిష్కారం అసాధ్యం వైసీపీ హయాంలో జరిగిన అవకతవకల ఇన్వేస్టిగేషన్ కు అధిక సమయం పడుతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ల్యాండ్ రీ–సర్వేలు, డిస్ట్రిక్ట్ కమిటీల ఏర్పాటు ? జనవరి 20, 2025 నుంచి రీ–సర్వే ప్రారంభించారు, కానీ పూర్తి అమలుకు 4–6 నెలలు పడుతుందని అంటున్నారు.

కానీ ఎప్పటికప్పుడు త్వరలో అంటున్నారు కానీ.., పరిష్కారం దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఉనీఓ రికమెండేషన్లు, డిజిటల్ రికార్డులు భూ–రక్ష వంటివి ద్వారా త్వరిత పరిష్కారం సాధ్యమేనని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలని అంటున్నారు. మరి ప్రభుత్వం ఆలకిస్తుందా ? ప్రభుత్వాలే సృష్టించిన పేదల కష్టాలు తీరుస్తుందా?

# టీడీపీలో కొత్త నీరు.. పాతనీరు

నెల్లూరు, నవంబర్ 12 తెలుగుదేశం పార్టీకి అంతకు ముందు లేని సమస్య ఇప్పుడు రావడానికి ప్రధాన కారణం ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలేనన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. గత ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నేతలకు టిక్కెట్లను ఇచ్చి తెలుగుదేశం పార్టీ నాయకత్వం బరిలోకి దింపింది. ముఖ్యంగా వైసీపీ నుంచి వచ్చిన నేతలు ఎక్కువ మందికి టిక్కెట్లు ఇచ్చిన వారిలో ఉన్నారు. అయితే వారికి, కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న వారికి మధ్య గ్యాప్ పెరిగింది. ఇతర పార్టీల నుంచి వచ్చి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు స్థానిక టీడీపీ నేతలను దగ్గరకు తీసుకోవడం లేదు. తమకు తాము ప్రత్యేకంగా ఒక టీం ను ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు. అంటే పాత టీడీపీ నేతలపై వారికి నమ్మకం లేకనే ఈ మధ్య అనేక వివాదాలకు కారణమయింది. తంబళ్లపల్లి నకిలీ మద్యంకేసు దగ్గర నుంచి కావలి నియోజకవర్గం రగడ వరకూ అదే సమస్య. ఎందుకు ఇతర పార్టీల నేతలను పార్టీలోకి చేర్చుకోవాలి? నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న టీడీపీకి పోటీ చేసే నేతలు లేరా? అన్న ప్రశ్న తెలుగు తమ్ముళ్లలో వ్యక్తమవుతుంది. కేవలం ఆర్థికంగానూ, సామాజికపరంగానూ లెక్కలు వేసుకుని ఇతర పార్టీల నేతలకు గాలం వేసి మరీ పార్టీ కండువాలు కప్పేసి వారికే బీఫారాలు ఇస్తే ఇక తాము దశాబ్దాలుగా పడిన కష్టాలకు ప్రతిఫలిం ఏముంటుందని కొందరు నేతలు ఆఫ్ ది రికార్డుగా ప్రశ్నిస్తున్నారు. గెలిచిన తర్వాత తమను చులకన చేసి చూడటం, తమను వేగులుగా భావించి దగ్గరకు రానివ్వకపోవడం వంటి వాటిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు టీడీపీ నేతలు నేరుగా నారా లోకేశ్ కు ఫిర్యాదు చేశారు. . కావలి టీడీపీ నేత సుబ్బనాయుడు మృతి తర్వాత జరిగిన ఘటనలు చూస్తే ఇదే అర్థమవుతుంది. సుబ్బనాయుడు మృతి పట్ల నెల్లూరు జిల్లాలోని నేతలు సీరియస్ గా స్పందించాల్సిన సమయంలో వారు మౌనంగా ఉండటంతో పాటు ఆయన అంత్యక్రియలకు పార్లమెంటు సభ్యుడు, చాలా మంది ఎమ్మెల్యేలు డుమ్మాకొట్టడం కూడా పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే ఇటీవల కావలి నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్ దగదర్తి వెళ్లి సుబ్బనాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. కావలి టీడీపీలో తలెత్తిన విభేదాలను పరిష్కరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి బాధ్యతను అప్పగించారు. అయితే వేమిరెడ్డికి, కావ్య కృష్ణారెడ్డికి కూడా పొసగదని అంటున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని అనేక నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల డామినేషన్ పెరిగిపోవడంతో టీడీపీ ఒరిజనల్ నేతలు ఇబ్బందులు పడుతున్నారు. మరి దీనికి పార్టీ నాయకత్వం ఏ రకమైన పరిష్కారం చూపుతుందన్నది చూడాలి.

# టీడీపీలో ఆ ఎమ్మెల్యేలపై చర్యలే....

విజయవాడ, నవంబర్ 12 ప్రత్యర్థులే కాదు.. సొంత వారి చర్యలపై దృష్టి పెట్టి ఉండాలంటారు పెద్దలు. ఎందుకంటే తమ వెంటే ఉండి తప్పులు చేసిన వారు ఉంటారు. అటువంటి వారితో చెడ్డ పేరు రావడం ఖాయం. ఇప్పుడు ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ జాగ్రత్తలు పడుతున్నారు. వరుసగా వారు చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు కూటమిలో వస్తున్న మార్పులను తెలియజేస్తోంది. రానున్న కాలంలో సంక్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయని గ్రహించి ముందుగానే వారు ఇప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పనిచేయని ఎమ్మెల్యేలను క్లాస్ పీకుతున్నారు. సొంత చరిష్మాతో గెలిచాం అనుకుంటున్న ఎమ్మెల్యేలు బయటకు వెళ్ళిపోవచ్చు అని చంద్రబాబు సూచించారు. తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు చాలామంది వ్యవహార శైలి బాగాలేదని.. అటువంటివారు పనితీరు మార్చుకోవాలని లోకేష్ హెచ్చరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అవకాశం ఇస్తే.. వారి నమ్మకాన్ని వమ్ము చేసుకోకూడదని పవన్ కళ్యాణ్ గట్టిగానే ఎమ్మెల్యేలకు హెచ్చరికలు పంపారు. తద్వారా మున్ముందు గట్టి మార్పులే ఉంటాయని సంకేతాలు పంపారు.చంద్రబాబుతో పాటు పవన్ రెక్కల కష్టంపై కూటమి అధికారంలోకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత తోడు వీరి కృషి ఉంది. ఆపై లోకేష్ పట్టుదల కూడా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ఎమ్మెల్యేల పనితీరుతో చెడ్డ పేరు వస్తుందని నేరుగా గ్రహించారు. ముఖ్యంగా టిడిపిలో పరిస్థితి చేయి దాటుతుందన్న అనుమానాలు ఉన్నాయి. 1995లో పార్టీ బాధ్యతలు తీసుకున్నారు చంద్రబాబు. చాలామంది తటస్థులను సైతం రాజకీయాల్లోకి తీసుకొచ్చి అవకాశాలు కల్పించారు. దాని ద్వారా ఆయనకు రాజకీయ ప్రయోజనం దక్కిందే కానీ.. ఇప్పటిలా ఇబ్బందులు ఎదురు కాలేదు. కూటమి ప్రభంజనంలో వైసీపీ బలమైన నియోజకవర్గాలను సైతం చాలామంది అలవోకగా గెలవగలిగారు. అయితే అటువంటి వారు తమ సొంత చరిష్మాతో గెలిచామని భావిస్తున్నారు. వారితోనే ఇప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. టిడిపి ఎమ్మెల్యేల పనితీరు ప్రభావం కూటమిపై పడుతోంది. చంద్రబాబులో అదే కలవరం.మూడు దశాబ్దాలుగా పార్టీ బాధ్యతలు చూస్తున్నారు చంద్రబాబు. అధికారంలో ఉన్నారు. విపక్షంలో సైతం కొనసాగారు. కానీ ఈసారి విచిత్రంగా కొత్తవారు గెలిచారు. అటువంటి వారి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలా బయటపడాలో కూడా చంద్రబాబుకు తెలియడం లేదు. కొలికపూడి శ్రీనివాసరావు, బొజ్జల సుధీర్ రెడ్డి, రెడ్డప్ప గారి మాధవి, కావ్య కృష్ణారెడ్డి, జయ చంద్రారెడ్డి వంటి వారితో ఎప్పటికప్పుడు ఇబ్బందులు వస్తూ వచ్చాయి. ఇలానే వదిలేస్తే తెలుగుదేశం పార్టీతో పాటు కూటమికి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే చంద్రబాబు ఎలా గాడిలో పెట్టాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే వివాదాస్పద ఎమ్మెల్యేల చుట్టూ ఇప్పుడు టిడిపి అనుకూల మీడియా వాచ్ ఉంటుంది. ఆపై నిఘా వర్గాలు కూడా ఉంటాయి. అటువంటి ఎమ్మెల్యేలను వదులుకోవాలంటే.. వారిపై ఒక రకమైన ముద్ర వేసి విడిచి పెడతారు. రాజకీయాల్లో రాణించలేని పరిస్థితి ఉంటుంది. అదే విషయాన్ని ఈ ఎమ్మెల్యేలకు చెబుతోంది అత్యున్నత కమిటీ. వివాదాస్పద ఎమ్మెల్యేల తీరు రోజురోజుకు జఠిలం అవుతున్న తరుణంలో.. ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. మారుతారా? మారరా? మారకపోతే ఇన్ని ఇబ్బందులు ఉంటాయి? ఇది ఇబ్బందులు పడాల్సి ఉంటుంది అంటూ ఆ కమిటీ స్పష్టం చేస్తుంది. వినకపోతే వారి విషయంలో సీరియస్ యాక్షన్ మొదలు అవుతుంది.

## విశాఖ బీచ్ రోడ్డులో యూనిటీ రన్

ఉక్కు మనిషి భారత మాజీ ఉప ప్రధాని, మాజీ కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా యూనిటీ రన్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విశాఖ బీచ్ రోడ్డులో మైభారత్ ఆధ్వర్యంలో జరిగిన యూనిటీ రన్ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ , నార్త్ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు మరియు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జెండా ఊపి ఐక్యతా రన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖండ భారతావని కోసం ఎంతో కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు. బీచ్ రోడ్ కాళీమాత ఆలయం నుండి వైయంసిఏ వరకు భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేస్తూ యూనిటీ రన్ చేసారు. ఈ కార్యక్రమంలో కోటమి నాయకులు ఎంపీ మరియు ఎమ్మెల్యేల నాయకులు పాల్గొన్నారు

# నెలలో 13 కోట్లు తగ్గిన ఎకరం!

×రాయదుర్గ్‌లో ఎకరం భూమికి 164 కోట్లు..ఇదే ప్రాంతంలో గత నెలలో 177 కోట్లు

×టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై పలు అనుమానాలు

×నెల రోజుల్లోనే ఇంత వ్యత్యాసం రావడం రియల్ఎస్టేట్ వర్గాలను ఆందోళన

×నగరంలో భూముల విలువ పడిపోవడంలేదని చెప్తున్న టీజీఐఐసీ అధికారులు

హైదరాబాద్, నవంబర్ 12 రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి రియల్ఎస్టేట్ రంగం నేలచూపులు చూస్తున్న నేపథ్యంలో టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క నెలలోనే ఎకరాపై దాదాపు రూ.13 కోట్ల వరకూ ధర తగ్గడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. టీజీఐఐసీ తాజాగా నిర్వహించిన రాయదుర్గ్ పాన్‌మక్తా భూముల వేలంలో ఎకరాకి రూ.164 కోట్ల ధర పలికింది. అదే ప్రాంతంలో గత నెలలో వేలం నిర్వహించగా ఎకరా భూమి రూ.177 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. ఒకే ప్రాంతంలో నెల రోజుల్లోనే ఇంత వ్యత్యాసం రావడం రియల్ఎస్టేట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

గజం 3.4 లక్షలు

టీజీఐఐసీ సోమవారం రాయదుర్గ్ పాన్‌మక్తాలో రెండు ప్లాట్లకు వేలం నిర్వహించగా, గజానికి రూ.3,40,000 చొప్పున ధర పలికింది. ఈ రెండు ప్లాట్లు కలుపుకొని 4,700 గజాలు (ఎకరాకు సుమారు 140 గజాలు తక్కువ) కాగా, దీనిపై టీజీఐఐసీకి రూ.160 కోట్ల ఆదాయం సమకూరింది. దీన్నిబట్టి ఎకరా ధర రూ.164 కోట్లుగా చెప్పవచ్చు. నాలెడ్జ్‌సిటీగా పేరుగాంచిన పాన్‌మక్తా ప్రాంతంలో గత అక్టోబర్‌లో టీజీఐఐసీ వేలం నిర్వహించగా, ఎకరా భూమికి రూ.177 కోట్ల ధర పలికింది. దీనిపై టీజీఐఐసీ అధికారులు స్పందిస్తూ.. తాజా వేలంలో ఎకరా భూమి రెండు ప్లాట్లుగా విడివిడిగా ఉండటం వల్లే బిల్డర్ల మధ్య పోటీ తగ్గి ధర తగ్గిందని, అంతేతప్ప నగరంలో భూముల విలువ పడిపోవడంలేదని చెప్తున్నారు. 2017లో ఇదే ప్రాంతంలో వేలం నిర్వహించగా గజం ధర రూ.88,000 మాత్రమే పలికిందని, దాంతో పోల్చుకుంటే ఇప్పుడు పలుకుతున్న ధర ఎంతో అధికమని సమర్థించుకుంటున్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఫుల్ జోష్

హైదరాబాద్ వెస్ట్‌జోన్ ప్రాంతంలో భూముల ధరలు పెరగడమే తప్ప తగ్గడం అనేది ఉండదు. గత అనుభవాల ద్వారా ఇది స్పష్టమవుతున్నది. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు పెరిగాయి. పదేండ్లపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో భూముల ధరలు పెరగడం విశేషం. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి రియల్ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయింది. ముఖ్యంగా వ్యవసాయ భూములు కొనే నాథుడే కరువయ్యాడు. హైదరాబాద్‌లో సైతం వేల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు అమ్ముడుపోవడంలేదని వివిధ సర్వేలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూముల విక్రయం ద్వారా రియల్ఎస్టేట్ రంగం స్థిరంగా ఉన్నదనే సందేశం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని పలువురు చెప్తున్నారు. మొత్తం మీద వేలంలో భూముల ధర హెచ్చుతగ్గులపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## కార్మిక,కర్షక ఆశాజ్యోతి సి. ప్రభాకర్‌ఆశయాలను కొనసాగిద్దాం

## సిపిఐ జిల్లా కార్యదర్శి విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు



కోరుట్ల, :నిరంతనం కార్మికుల,కర్షకుల పేద,బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమించిన పోరాట యోధుడు సి. ప్రభాకర్ ఆశయ సాధన కొనసాగిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు అన్నారు .బుధవారం పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రభాకర్ 82వ జయంతిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పలువురు నివాళులర్పించారు.అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ రైతు కూలీల సమస్యల కోసం హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బీడీ కార్మికుల సంక్షేమం కోసం చట్టాలు అమలు చేయుట కోసం పల్లె నుండి ఢిల్లీ వరకు అనేక ఉద్యమం పోరాటాలు నిర్వహించిన ఘనత సి. ప్రభాకర్ కి దక్కుతుందన్నారు. బీడీ కార్మికులకు ఇండ్ల స్థలాలు కూలి పెంపు బోనాసు కరువు,భత్యం, ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ చట్టాలు, అమలు జరిగాయి అంటే పోరాట ఫలితం గానే ఈరోజు కార్మికులు అనుభవిస్తున్నారన్నారు. ఆయన లేని లోటు ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి కార్మిక రంగానికి తీరని ఆయన మన ముందుంచిన ఆశయాలను నెరవేర్చుదామని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సి ప్రభాకర్ స్మారక గ్రంథాలయం అధ్యక్షులు రాస భూమయ్య, రాచకొండ పెద్ద దేవయ్య, సిపిఐ నేతలు ఎద్దండి భూమయ్య, ఎండి ముక్రం, మునుగోరి హనుమంతు, ఎండి అక్రమ్, ఉస్మాన్, వెన్న మహేష్, కిరణ్, ఎండి సమీర్, పాతర్ల విజయ్, మేకల రాజం, గోపం లక్ష్మీనారాయణ, అందే వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తుగ్గలి: ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ ప్రజలకు తెలియజేశారు. బుధవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల బొందిమడుగుల గ్రామం నందు గ్రామ పరిశుభ్రతలో భాగంగా మండల అభివృద్ధి అధికారి విశ్వమోహన్ చెత్త సేకరణ ట్రై సైకిల్స్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్మికులకు మీ వీధిలోకి వచ్చినప్పుడు చెత్తను అందులో వెయ్యాలని తెలియజేశారు. ప్రభుత్వం వారు అందజేసిన తడి చెత్త మరియు పొడి చెత్త బుట్టలను వినియోగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరవ సలహాదారుడు ప్రతాప్ యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగేంద్ర నాయక్,వార్డ్ మెంబర్స్ వీరేంద్ర,బెస్తా లక్ష్మీదేవి,తలారి రాముడు,స్వచ్ఛభారత్ కార్మికులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



తుగ్గలి: ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.బుధవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల రాంపల్లి గ్రామం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోందికార్యక్రమాన్ని వారు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు,టిడిపి మండల అధ్యక్షుడు తిరుపాలు నాయుడు శ్రీబీ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ద్రవ జీవామృతం తయారు చేయడానికి కావలసిన పదార్థాలు మరియు ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని గ్రామ రైతులకు వారు వివరించారు.అలాగే భూమాత రక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులు వాడుతున్న రసాయనిక ఎరువుల దుష్పరిణామాలు,భూమిపై ఎలా ఏ విధంగా ప్రభావం చూపుతోందో అని రైతులకు తెలియజేశారు.భూమి యొక్క స్వభావాన్ని కాపాడుకోవడానికి అందరూ కూడా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా రైతులకువారు అవగాహన కల్పించారు.అలాగే ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించి రైతులకు పంటల దిగుబడి పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మల్లేష్,సచివాలయ ఉద్యోగులు,రైతులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలి

## మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం దిగుమతులు చేసుకోవాలి

## ధాన్యం కొనుగోళ్లపై రైతులు, మరియు మిల్లర్ల తో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష సమావేశం



జగిత్యాల/కొడిమ్యాల రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశించారు.బుధవారం జిల్లాలోని మల్యాల, కొడిమ్యాల మండల పరిధిలోని రైతులు, రైస్ మిల్లర్ లతో జేఎన్టీయూ కళాశాలలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సంధర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూరైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని ఆదేశించారు.రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 % లోపు వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని రైతులకు సూచించారు.రైతులు వరి కోతల తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, పొలం నుండి నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావద్దని రైతులను కోరారు.ఆనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తేమశాతం వచ్చేవరకు ధాన్యం ఆరబెట్టాలని తెలిపారు.రైతులు ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వస్తే వెంటనే కాంటా వేసి సంబంధిత మిల్లులకు నిర్వాహకులు ధాన్యాన్ని తరలిస్తారని అన్నారు.రైతుల వివరాలు వెంటనే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందించాలని తెలిపారు.కొనుగోలు కు సంబందించిన సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం దిగుమతులు చేసుకోవాలని ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, డిఎస్వో జితేందర్ రెడ్డి, డిసివో మనోజ్ కుమార్, డిఏం జితేంద్ర ప్రసాద్, ఎమ్మార్వో లు, ఎంపిడివోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి

## జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



జగిత్యాల/కొడిమ్యాల, కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని,ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు రాగానే త్వరగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు.బుధవారం జిల్లా లోని కొడిమ్యాల మండలంలోని పూడూరు, నాచుపల్లి, డబ్బు, తిమ్మయ్యపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ నిర్వాహకులకు తెలిపారు.టార్పాలిన్, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు అవసరమైన మేరకు అందుబాటులో ఉండాలని నిర్వాహకులకు సూచించారు.రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలని, హమాలీల సమస్య లేకుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కొనుగోలు



కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. గ్రేడ్ ' ఏ ' రకానికి 2389/- రూ.సాధారణ రకానికి 2369/- రూ.సన్నరకం ధాన్యానికి క్వింట కు 500/- రూ. బోనస్ ప్రభుత్వం అందిస్తుందని రైతులకు తెలిపారు.పొలం నుండి ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా ధాన్యాన్ని తేమ శాతం 17% వచ్చేవరకు ఆరబెట్టాలని రైతులకు సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వెంటనే నిర్వాహకులకు రైతు వివరాలు అందించాలని తెలిపారు.ఈ పర్యటనలో ఆర్డీవో మధుసూదన్,డిఎస్వో జితేందర్ రెడ్డి, డిసివో మనోజ్ కుమార్, డిఏం జితేంద్ర ప్రసాద్, ఎమ్మార్వో లు ఎంపిడివో లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొట్టాలచెరువు గూడెం దీర్ఘకాలిక భూసమస్య పరిష్కారం దిశగా చర్యలు

## రీసర్వేకు పూర్తి సహకారం అందించాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల జిల్లాలోని కొట్టాలచెరువు గూడెంలో దాదాపు నలభై సంవత్సరాలుగా పరిష్కారం కాని భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం కొట్టాలచెరువు గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ గూడెం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కొట్టాలచెరువు గూడెంలో భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రీసర్వే బృందాలను ఏర్పాటు చేసి సర్వే ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. గూడెంలో ఉన్న దీర్ఘకాలిక భూవివాదాలను సమూలంగా పరిష్కరించేందుకు జిల్లా పరిపాలన కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ఈ క్రమంలో రీసర్వే బృందాలను నియమించామని సర్వే ప్రక్రియలో గిరిజనులు పూర్తి సహకారం అందించాలన్నారు. గతంలో రీసర్వే పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం పట్టేదని, కానీ ప్రస్తుతం ఆధునిక సాంకేతికతను వినియోగించి మూడు నెలల వ్యవధిలోనే సర్వే పూర్తి చేయగలుగుతున్నామన్నారు. సర్వే అనంతరం తుది ఆర్.ఓ.ఆర్ ఉత్తర్వులు జారీ కాగానే లబ్ధిదారుల పేర్లతో రికార్డులు నమోదు అవుతాయన్నారు. తద్వారా అడంగల్, 1-బి, పాస్‌బుక్, రాజముద్ర పత్రాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. రికార్డులో పేరు నమోదు కావడం వలన రైతులు ఈ-క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల లబ్ధిని సులభంగా పొందగలుగుతారన్నారు. ప్రస్తుతం రికార్డుల్లో పేర్లు లేని రైతులు కూడా నష్టపోకుండా చూసుకుంటున్నామన్నారు. అయితే రికార్డుల్లో పేరు నమోదు అయితే మరింత ఆర్థిక లబ్ధి పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు.×కొట్టాలచెరువు గ్రామంలోని 393.78 ఎకరాల భూమిని త్వరితగతిన రీసర్వే పూర్తి చేసి లబ్ధిదారుల పేర్లలో నమోదు చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద పంట పొలాలకు రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 56 మంది చెంచు కుటుంబాలకు గృహ పత్రాలను పంపిణీ చేసి గృహప్రవేశాలు నిర్వహించారు. పట్టాలు పొందిన భూములను ఇతరులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.×శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కొట్టాలచెరువు గూడెంలో దాదాపు నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కాని భూసమస్యలపై జిల్లా కలెక్టర్ చొరవ చూపి పునరావాసం, భూ హక్కుల పత్రాలు అందించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. ఈ రీసర్వే ద్వారా గిరిజనులకు శాశ్వత హక్కులు లభిస్తాయని అన్నారు. అలాగే పెచ్చరుగు గూడెం నుంచి వచ్చిన గిరిజనులకు సాగు చేసుకునే భూములు కల్పించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

# 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు

**వచ్చే ఉగాది రోజున 5.90 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం**

**ఇల్లు లేని పేదల గుర్తింపు ప్రక్రియ డిసెంబర్ 1వ తేదీ నాటికి పూర్తి**

**ఇళ్ల నిర్మాణం నిమిత్తం ముస్లింలకు అదనంగా రూ. 50 వేలు**

**గత పాలకులు ఇళ్లను రద్దు చేశారు... బిల్లులు పెండింగ్ పెట్టారు**

**కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని కాదు... మంచిని చూడండి**

**అన్నమయ్య జిల్లా, దేవగుడిపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహప్రవేశాలు... వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం**

**దేవగుడిపల్లిలో లబ్ధిదారులతో కలిసి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి**






రాయచోటి, నవంబర్ 12: 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఉగాది రోజున మరో 5.90 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో బుధవారం జరిగిన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్లను దేవగుడిపల్లె సభా ప్రాంగణం నుంచే వర్చువల్ గా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా ఇంటి తాళాలు అందజేశారు. సొంత స్థలాలున్న పలువురికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంగళవారం నాడు కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించాం. ఆ మరుసటి రోజే పేదలకు ఇళ్లు ఇవ్వడం ఆనందంగా ఉంది. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. ఇల్లంటే కేవలం నాలుగు గోడలు కాదు... ఒక కుటుంబానికి గౌరవం, సంతోషం, భద్రత, భరోసా. 1984లో ఎన్టీఆర్ దేశంలోనే మొదటిసారిగా పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించడంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశాం. పీఎంఏవై బీఎల్సీ కింద 2,28,034 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద 65,292 ఇళ్లు, పీఎంఏవై జన్మన్ కింద 6,866 ఇళ్లు మొత్తం కలిపి 3,00,192 ఇళ్లు నిర్మించాం."అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను కూల్చేసింది**

'2014-2019 మధ్య రూ.16 వేల కోట్ల వ్యయంతో 8 లక్షల ఇళ్లు పూర్తి చేశాం. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను చిదిమేసింది. 4.73 లక్షల ఇళ్లు రద్దు చేయడమే కాకుండా... 2.73 లక్షల మంది లబ్దిదారులకు చెల్లించాల్సిన రూ.900 కోట్లు బకాయిలు పెట్టింది. ఆ బకాయిలను చెల్లించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. గత పాలకులు గృహ నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేశారు. నివాస యోగ్యం కాని చోట్ల పేదలకు స్థలాలు ఇచ్చారు... ఇళ్లు నిర్మించకుండా వదిలేశారు. ఇళ్ల స్థలాల స్కీం పేరుతో స్కాం చేశారు. చదును చేసే పేరుతో అవినీతికి పాల్పడ్డారు. చివరకు ఇసుకలోనూ కోట్లు దోచుకున్నారు. ఐదేళ్లలో కేంద్రం డబ్బులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇది పేదల ప్రభుత్వం. పేదలకు న్యాయం చేయడం కోసం అనునిత్యం పని చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ఇచ్చే డబ్బే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తోంది. పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేస్తోంది. దీనికి అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50,000, ఎస్టీలకు రూ.75,000, పీవీటీజీలకు రూ.1,00,000 చొప్పున ఇస్తున్నాం. ఇకపై ముస్లింలకు కూడా రూ. 50 వేలు అదనంగా అందజేస్తాం. దాదాపు 6 లక్షల మంది ఇళ్లు కట్టుకునే స్థోమత లేక నిలిపేశారు. వీటిని పూర్తి చేసేందుకు మేం సహకరిస్తాం. ఈ నిర్ణయంతో 3.73 లక్షల మంది బీసీలకు, 1.57 ఎస్సీలకు, 46 వేల మంది ఎస్టీలకు, 22 వేల మంది గిరిజనులకు మేలు జరుగుతుంది. ఈ అదనపు సాయం వల్ల ప్రభుత్వానికి రూ.3,220 కోట్ల ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణాలు చేపట్టడంతోపాటు... తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, గ్యాస్ కనెక్షన్, సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం."అని ముఖ్యమంత్రి తెలిపారు.

**అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం**

"సుస్థిర ప్రభుత్వంతోనే సుపరిపాలన, అభివృద్ధి సాధ్యం. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలి. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తాం. రూ. 50 వేల కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటిపైనే కరెంటు తయారు చేసుకునేలా సోలార్ ఏర్పాట్లు చేస్తాం. ఒకప్పుడు పొలంలో పంటలు పండేవి. ఇప్పుడు కరెంటు ఉత్పత్తి చేసే పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వం తాగునీటి పథకాలను కూడా నిర్వీర్యం చేసింది. జల్ జీవన్ మిషన్ ద్వారా కేంద్రం ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు ఇవ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం పులివెందులకు కూడా నీరివ్వలేదు. త్వరలో పులివెందులకూ తాగునీరు అందిస్తాం. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ అమలు చేశాం. మహిళలకు దీపం పథకం కింద ఉచితగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అర్హులకు పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. రైతులకు మూడు విడతలుగా ఆర్థిక సాయం అందించేలా అన్నదాత సుఖీభవ పథకాన్నీ అమలు చేస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మందిని ఉపాధ్యాయులుగా భర్తీ చేశాం. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగం, పెట్టుబడులు అనే మాట వినపడలేదు. నాడు పారిశ్రామికవేత్తలు పారిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల కాలంలో రూ. 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలను కుదుర్చుకున్నాం. విశాఖ సీఐఐ సదస్సులో మరో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుంటాం. 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లలో కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేకపోయారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.500 కోట్లు విడుదల చేసి రోడ్లన్నీ మరమ్మతులు చేస్తున్నాం. ప్రజలు కూడా తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలి. కులం, మతం, ప్రాంతం అని చూడకుండా... మంచి చేసే వారిని ఆశీర్వదించాలి."అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**నదుల అనుసంధానంతో కరువుకు చెక్**

"నదుల అనుసంధానం నా జీవిత ఆశయం. గంగా-కావేరి అనుసంధానం జరిగితే దేశంలో కరువు అనే మాట వినపడదు. సాగునీటి ప్రాజెక్టులను నేను ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తాం. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో తాగు, సాగు నీటి కొరత లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నాం. వెనిగల్లు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. మరో రూ.22 కోట్లు ఇస్తే మరిన్ని చెరువులకు నీరు అందే అవకాశం ఉండటంతో వెంటనే మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాదికి శ్రీనివాసపురం రిజర్వాయర్ పూర్తి చేస్తాం. ఇక్కడ నుంచి చిత్తూరుకు హంద్రీనీవా నీరు మళ్లిస్తాం. అలాగే మొదటి ఫేజ్ లో నల్లమల సాగర్ ద్వారా వెలుగొండకు నీళ్లు తెస్తాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నాం. 2029 నాటికి స్వర్ణాంధ్ర సాకారం దిశగా అడుగులు వేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భాగస్వామ్య సదస్సుకు సన్నద్ధమైన విశాఖ

**ఈనెల 14, 15 తేదీల్లో ఏపీ ప్రభుత్వం - సీఐఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహణ**

**దేశ, విదేశాల నుంచి హాజరు కానున్న వివిధ సంస్థల ప్రతినిధులు**

**పెట్టుబడిదారులతో భేటీ కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

**సదస్సు వేదికగా సమావేశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**నాలుగు రోజుల పాటు విశాఖలోనే సీఎం చంద్రబాబు**

**ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా సదస్సుకు భారీ ఏర్పాట్లు**

**రాష్ట్రంలో పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా భాగస్వామ్య సదస్సు**

**ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేతుల ఎల్లుండి ప్రారంభం కానున్న సదస్సు**

అమరావతి, నవంబర్ 12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ 'సి.ఐ.ఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2025' కోసం విశాఖ సన్నద్ధం అయ్యింది. సదస్సు ను విజయవంతంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తునారు. అందుకు తగినట్టుగా అధికార యంత్రాగాన్ని సన్నద్ధం చేశారు. 'ఇన్వెస్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే సందేశాన్ని ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పాలని

ముఖ్యమంత్రి సంకల్పించారు. గ్రీన్ ఎనర్జీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, స్పేస్, డిఫెన్స్, టూరిజం రంగాల్లో భారీగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు విశాఖపట్నంను భారత తూర్పు తీరంలో గ్లోబల్ ట్రేడ్ గేట్‌వే గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. విశాఖలోని ఆంధ్ర విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. పార్ట్‌నర్స్ ఇన్ ప్రోగ్రెస్ %-% ఇండియాస్ రోడ్ మ్యాప్ టు వికసిత్ భారత్-2047' థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. 100కి పైగా విదేశీ ప్రతినిధులు పాల్గొనే అవకాశంతో పాటు పెట్టుబడులకు సంబంధించి 30కి పైగా అవగాహనా ఒప్పందాలు జరగనున్నాయి. బుధవారం నుంచి సదస్సు ముగిసే శనివారం వరకు వివిధ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అవుతారు. రాష్ట్రంలో ప్రాంతాల వారీగా వివిధ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను ముఖ్యమంత్రి ఈ వేదిక నుంచి వారికి వివరించనున్నారు. అలాగే రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రధాన థీమ్ సెషన్లు నిర్వహిస్తారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

**నవంబర్ 12, బుధవారం :**

బుధవారం ముఖ్యమంత్రి విశాఖ చేరుకున్న అనంతరం భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కళ్యాణితో సమావేశం అవుతారు. తర్వాత భాగస్వామ్య సదస్సు నిర్వహణపై సీఐఐ ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షిస్తారు.

**నవంబర్ 13, గురువారం :**

గురువారం విశాఖలోని నొవటెల్‌లో 'పార్ట్‌నర్స్ ఇన్ ప్రోగ్రెస్ %-% ఇండియా %-% యూరప్ కోపరేషన్ ఫర్ సస్టైయినబుల్ గ్రోత్' అంశంపై జరిగే ఇండియా%-%యూరోప్ బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. గ్రీన్ షిఫ్ట్, సస్టైనబుల్ ఇన్నోవేషన్, యూరోపియన్ పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. మధ్యాహ్నం తైవాన్, ఇటలీ, స్వీడన్, నెదర్లాండ్స్ ప్రతినిధులతో ముఖ్య భేటీలు ఉన్నాయి. ఎస్పీపీ పంప్స్ లిమిటెడ్, రెన్యూ పవర్, బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్, మురుగప్ప గ్రూప్, జూల్ గ్రూప్, హీరో ఫ్యూచర్ ఇంజినీర్స్ ప్రతినిధులతో సీఎం సమావేశమై చర్చిస్తారు. సాయంత్రం 'వైజాగ్ ఎకనమిక్ రీజియన్' కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 'స్పెషల్ మీటింగ్ ఆఫ్ సీఐఐ నేషనల్ కౌన్సిల్'కు హాజరవుతారు.

**నవంబర్ 14, శుక్రవారం :**

శుక్రవారం 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సును భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించనున్నారు. ఏపీ పెవిలియన్ ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కూడా పాల్గొంటారు. యూసుఫ్ అలీ, బాబా కళ్యాణి, కరణ్ అదానీ వంటి విశిష్ట అతిధులు దీనికి హాజరు కానున్నారు. సదస్సు ప్రారంభ కార్యక్రమం తర్వాత 'టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్' సెషన్ జరగనుంది. మధ్యాహ్నం జరిగే 'ఏఐ ఫర్ వికసిత్ భారత్' సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఆర్టిఫీషియల్ ఇంటిజెన్స్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వృద్ధికి ఏ విధంగా దోహద పడుతుందో సీఎం తన ప్రసంగంలో వివరిస్తారు. సింగపూర్ నుంచి విజయవాడకు నేరుగా విమాన సర్వీసులు నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్ ప్రతినిధులతో ఒప్పందం చేసుకోనుంది. సాయంత్రం రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్వహించే 'రీఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్'లో సీఎం పాల్గొంటారు. సంజీవ్ గోయింకా గ్రూప్ వైస్ చైర్మన్‌తో సమావేశమై అనంతరం విశాఖలో లులూ నిర్మించే నూతన మాల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. రాత్రికి వివిధ కంపెనీలు ప్రభుత్వ ప్రతినిధులు, ఆహ్వానితుల గౌరవార్ధం ఇచ్చే గాలా డిన్నర్‌లో పాల్గొంటారు.

**నవంబర్ 15, శనివారం :**

సదస్సు రెండో రోజు శనివారం... ఉదయం బ్లూమ్‌బెర్గ్ మీడియా ఇంటరాక్షన్‌లో సీఎం పాల్గొంటారు. తర్వాత రేమండ్, శ్రీసిటీ, ఇండోసోల్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే... బహ్రెయిన్, న్యూజిలాండ్, కెనడా, జపాన్ ప్రతినిధులతో భేటీ అవుతారు. మధ్యాహ్నం వరల్డ్ ఎకనమిక్ ఫోరానికి చెందిన 'సెంటర్ ఫర్ ఫ్రంటయిర్ టెక్నాలజీస్'ను ప్రారంభిస్తారు. అనంతరం గూగుల్ సంస్థ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం ఎవోయూల మార్పిడి కార్యక్రమం నిర్వహించనున్నారు. సదస్సు చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహిస్తారు. భాగస్వామ్య సదస్సుతో సాధించిన ఫలితాలను వివరిస్తారు.

**రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం :**

సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించడం ద్వారా రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని, ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు ఇప్పటికే సింగపూర్, యూఏఈ, యూకే వంటి దేశాల్లో పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రి రోడ్ షోలు, పర్యటనలు నిర్వహించారు. అటు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఇతర మంత్రులు దేశ, విదేశాల్లో పెట్టుబడుల కోసం పలు సంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. భాగస్వామ్య సదస్సు ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది

## జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద పేలుళ్లకు కుట్ర, వెలుగులోకి వచ్చిన తాజాగా కీలక విషయం

న్యూ ఢిల్లీ నవంబర్ 12 ;ఢిల్లీలో కారు పేలుడు ఘటనపై దర్యాప్తు చేస్తున్న కొద్దీ సంచలన విషయాలు బయటపడుతున్నాయి. గడిచిన రెండు, మూడు రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తోన్న ఉగ్రకుట్రకు, ఈ పేలుడుతో లింక్ ఉండటం.. ఈ భారీ కుట్రలో ఉన్నత విద్యావంతులైన ఐదుగురు డాక్టర్లు కీలక సూత్రధారులుగా తేలడం అందర్నీ ఆందోళనకు గురి చేస్తున్నది. ఇక ఈ దాడి ఘటనపై దర్యాప్తు సంస్థలు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది.పేలుడుకు ముందు దుండగులు పలుమార్లు ఎర్రకోట వద్ద రెక్కీ చేసినట్లు తెలుస్తోంది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద పేలుళ్లకు కుట్ర చేసినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఆ రోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగించనున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో అక్కడ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లుగా దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ దవాఖానలో డాక్టర్‌గా పనిచేస్తున్న పుల్వామాలోని కోలికి చెందిన ముజమ్మిల్ ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అతడిని అధికారులు విచారిస్తున్నారు. అతడి ఫోన్ స్వాధీనం చేసుకొని పరిశీలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అతను పలుమార్లు ఎర్రకోటను సందర్శించినట్లు ఫోన్ డేటా ద్వారా తేలింది. మొహమ్మద్ ఉమర్‌తో కలిసి ఎర్రకోటపై నిఘా పెట్టినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ చేపడుతున్నారు.

# రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

## రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 12 :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.బుధవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల గదులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసి సకల సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించాలని, ఉన్నత స్థాయిలో రాణించాలని తెలిపారు. విద్య ఎంతో శక్తివంతమైనదని, క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తు బంగారు మయమవుతుందని తెలిపారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుకోవడమే కాకుండా తమ తల్లిదండ్రులకు సహాయంగా నిలవాలని, విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని తెలిపారు. సాఫ్ట్,కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, తద్వారా ఆత్మవిశ్వాసం కలుగుతుందని, క్రమశిక్షణతో మంచి నైపుణ్యం పొందాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం 51 వేల మంది ఉపాధ్యాయులను నియమించినది తెలిపారు.పాఠశాలలలో అవసరమైన ఫర్నిచర్, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తుందని తెలిపారు. 2.5 కోట్ల రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో అదనపు గదులు నిర్మించడం జరిగిందని, రామకృష్ణాపూర్ లోని గురుకుల పాఠశాలలో 30 లక్షల రూపాయల ఎస్ డి ఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు 15 రోజులలో ప్రతిపాదనలు అందించాలని, విద్యార్థులకు చదువుకునేందుకు మంచి వాతావరణం కల్పించాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యలో అభివృద్ధి చెందేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య,విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్,ప్రహరీ గోడ, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు ఇతర సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. 2.5 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన జూనియర్ కళాశాల అదనపు గదులలో తరగతి గదులు,పరిపాలనా విభాగం, ల్యాబ్ ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో 6 వేల నుండి 7 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు.జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని,కోటపల్లి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, చెన్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాల లలో పనులు జరుగుతున్నాయని, జైపూర్ లోని ఎస్.సి. సంక్షేమ వసతి గృహం కొరకు సి.ఎస్.ఆర్. నిధులు మంజూరయ్యాయని తెలిపారు.జిల్లాలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నాయని,త్వరగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ప్రతి రోజు వారు పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు.జిల్లాలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్య అభ్యసించి ఎం.బి.బి. ఎస్. సీటు సాధించడం అభినందనీయమని,ఈ విషయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని చదువులో రాణించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునేందుకు ప్రతి ఒక్కరికి అవకాశం ఉందని,సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం 41 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాది ముబారక్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్కెట్లో బగ్గుమంటున్న కూరగాయల ధరలు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ కేంద్రంలో, కూరగాయల ధరలు బగ్గుమంటున్నాయి, గత నెలతో పోలిస్తే, రేట్లు అమాంతం పెరిగిపోయాయి, మిర్చి మంట పుట్టిస్తుంటే, కూరగాయల్లో రారాజైన వంకాయ, సామాన్యులకు అందనంత దూరంలో ఉంది, దీంతోకూరగాయలను కోనేందుకు జనం జంకుతున్నారు , ఓవైపు పెరిగిన గుడ్ల ధరలు, మరోవైపు పెరిగిన కూరగాయలను చూసి, జనం ఆవేదన చెందుతున్నారు, సంచి తో కూరగాయల మార్కెట్ కు వెళ్లాలంటేనే అడలిపోతున్నారు, సామాన్య జనం కు పెరిగిన కూరగాయల ధరలు, చుక్కలు చూపిస్తున్నాయి, నెల రోజుల్లో అంతకంతకు పెరిగిన ధరలు వినియోదారులకు ముచ్చెంటలు పట్టిస్తున్నాయి, పచ్చిమిర్చి, కాకరకాయ, అల్లం,ధరలు అమాంతం పెరిగిపోయాయి, క్యారెట్,మిర్చి, చిక్కుడు,బీర, ధరలు, సెంచరీ వైపు పరుగులు పెట్టగా, మిగతా కూరగాయలు ఆప్ సెంచరీ దాటడంతో, సామాన్యులు కొనలేక సతమతమవుతున్నారు, ఇక్కడి మార్కెట్లో అన్ని కూరగాయలు డబుల్ త్రిబుల్ రేట్లు అయ్యాయి, కొన్ని కూరగాయల అసలు మార్కెట్లో కనిపించడం లేదు, మరి ఆకుకూరలైతే 20, రూపాయలకు మూడు కట్టలు ఏ ఆకుకూరైనాసరే ,పెరిగిన కూరగాయ ధరలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు, గతంలో కిలో కూరగాయలను తీసుకువెళ్లే కస్టమర్లు, కిలో పావు కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు, ఒకప్పుడు రూపాయలు, 100,తీసుకెళ్తే సంచినిండ కూరగాయలు వచ్చేవని, ప్రస్తుతం 300, రూ,తీసుకెళ్లిన సరిపడా వెజిటేబుల్స్ రావడం లేదని ఆవేదన చెందుతున్నారు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల, కూరగాయల సాగు ఆశించినంత లేకపోవడంతో, ప్రస్తుతం కూరగాయ ధరలు ఎన్నడూ లేనివిధంగా పెరిగిపోతున్నాయి అంటున్నారు, మార్కెట్లో ధరలు పెంపుపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతుంది, వినియోగదారులు కూరగాయదరల పరుగుతో, పేద ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి...

# స్కీనేడర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నైలో 54మంది శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం)** ఖమ్మం స్థానిక పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్‌లో స్కీనేడర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై సంస్థలో 54 మంది విద్యార్థులు వార్షికంగా రూ.3.6 లక్షల వేతనంతో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మి నారాయణ తెలిపారు

స్కీనేడర్ సంస్థ హెచ్.ఆర్. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కోడింగ్ మరియు తాజా టెక్నాలజీలపై అవగాహన పెంపొందించుకోవాలి. నిరంతర అభ్యాసమే విజయం సాధించడానికి ప్రధాన ఆయుధం అని సూచించారు కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి కోసం మొదటి సంవత్సరం నుంచే ప్రత్యేక



తరగతులు నిర్వహిస్తున్నాము ప్లేస్మెంట్ విజయంలో అవి కీలక పాత్ర పోషించాయి ప్రతి విద్యార్థికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగం కల్పించడమే శ్రీ చైతన్య ధ్యేయం అని తెలిపారు కళాశాల డైరెక్టర్ శ్రీమతి మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులు ప్లేస్మెంట్ అవకాశాలకు సిద్ధమవ్వడానికి మాక్ ఇంటర్వ్యూలు టెక్నికల్ ట్రైనింగ్‌లు నిర్వహిస్తున్నాము ఈ కృషి ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో స్థానం సంపాదిస్తున్నారు అని అన్నారు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సాయి గీతిక మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకున్నప్పుడు మాత్రమే విజయం సాధ్యం అవుతుంది స్కీనేడర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నైలో ఎంపికైన విద్యార్థులకు హృదయ పూర్వక అభినందనలు అని అన్నారు ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డా. వి. సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి డిప్లొమా ఇన్‌ఛార్జి కృష్ణ ప్రసాద్ విభాగా ధిపతులు డా. ప్రణతి, డా. జ్యోతి, డా. చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పేలుళ్లతో హై అలర్ట్ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలో ముందస్తు విస్తృత తనిఖీలు



**కూకట్పల్లి (ప్రజాబలం) నవంబర్ 12:**రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట (రెడ్ ఫోర్ట్) సమీపంలో జరిగిన కారుబాంబు పేలుడు ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిత్వశాఖ అప్రమత్తమైంది. పలు రాష్ట్రాలను సైతం అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. అప్రమత్తమైన సైబరాబాద్ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు సీపీ అవినాష్ మొహంతి, ఐపీఎస్, ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు తనిఖీలు ముమ్మరం చేశారు. సిపి సూచనల మేరకు రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడం, నాకా బందీ చేపట్టడంతోపాటు, సున్నిత ప్రాంతాలపై నిఘా ఉంచాలని అవినాష్ మొహంతి ఆదేశించారు.

ఈ భద్రతా చర్యల్లో భాగంగా, బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో బుధవారం ప్రత్యేక సోదలు నిర్వహించారు. బొంబ్ డిటెక్షన్ స్కడ్ (బాంబు డిటెక్షన్ స్క్వాడ్) ఇంటెలిజెన్స్ విభాగం అధికారుల సహాయంతో జరిపిన ఈ తనిఖీల్లో జనసంచారం అధికంగా ఉండే ప్రధాన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.బాలానగర్ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ముఖ్యంగా జనసంచారం ఎక్కువ ఉండే ప్రాంతాలలో గంటల తరబడి తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఐడిపిఎల్ డిమార్ట్, విమల థియేటర్, రాజు కాలనీలోని దుర్గమాత దేవాలయం, సాయి నగర్‌లోని సాయి నాగేంద్రాలయం, శివాలయం, నర్సాపూర్ చౌరస్తా బస్టాప్ ప్రాంతాల్లో అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, వాహనాలను బాంబ్ డిటెక్షన్ స్కడ్ నిపుణులు జాగ్రత్తగా పరిశీలించారు. రాబోయే రోజుల్లో కూడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిఘా కొనసాగుతుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఐ నర్సింహా రాజు ఈ సందర్భంగా తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే తక్షణమే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రకృతి విపత్తులు

**×1995 నుంచి 2024 వరకూ 430 ప్రకృతి విపత్తుల్లో 80,000 మంది మృతి**

**× అంతేకాదు 170 బిలియన్ డాలర్ల నష్టం**

**× జర్మన్ వాచ్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్‌నివేదిక ద్వారా వెల్లడి**

హైదరాబాద్ నవంబర్ 12 ప్రకృతి విపత్తులు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఆకస్మిక వరదలు, భూకంపాలు, తుపానుల కారణంగా పెద్ద సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఇక గడిచిన 30 ఏళ్లలో ప్రకృతి సృష్టించిన విధ్వంసానికి వేల సంఖ్యలో ప్రజలు బలైనట్లు ఓ నివేదిక తాజాగా వెల్లడించింది.ప్రపంచ వ్యాప్తంగా గత మూడు దశాబ్దాల్లో ప్రకృతి విపత్తుల బారిన పడిన దేశాల్లో భారత్ తొమ్మిదో స్థానంలో ఉంది. 1995 నుంచి 2024 వరకూ చోటుచేసుకున్న 430 ప్రకృతి విపత్తుల్లో 80,000 మంది మరణించారు. సుమారు 130 కోట్ల మంది ప్రభావితమయ్యారు. అంతేకాదు 170 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు జర్మన్ వాచ్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ నివేదిక ద్వారా వెల్లడైంది. ఈ నష్టం 1998 గుజరాత్ తుపాన్లు, 1999లో ఒడిశాలో సూపర్ తుపాను, 2013 ఉత్తరాఖండ్ వరదలు సహా, కరవు, హీట్‌వేవ్స్ వల్ల సంభవించినవిగా సదరు

నివేదిక తెలిపింది.వాతావరణ పరిస్థితులు భారత్‌లో అభివృద్ధి, జీవనోపాధికి పెను ముప్పుగా మారినట్లు సదరు నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులు ఏటా లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్నట్లు వివరించింది. 2024లో భారత్‌లో రుతుపవనాల కారణంగా భారీ వర్షాలు, ఆకస్మిక వదలతో తీవ్రంగా నష్టం జరిగినట్లు పేర్కొంది. దాదాపు 8 మిలియన్లకుపైగా ప్రజలు, ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాలను తీవ్ర ప్రభావితం చేశాయని సదరు నివేదిక వెల్లడించింది.ప్రపంచ వ్యాప్తంగా 1995-2024 మధ్య 9,700 కంటే ఎక్కువ తీవ్రమైన ప్రకృతి విపత్తులు సంభవించినట్లు సదరు నివేదిక తెలిపింది. దాదాపు 8.3 లక్షలకు పైగా మరణాలు సంభవించినట్లు పేర్కొంది. ఈ విపత్తులు 5.7 బిలియన్ల మందిని ప్రభావితం చేసినట్లు వివరించింది. దాదాపు 4.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని కలిగించాయని జర్మన్ వాచ్ తెలిపింది. గత మూడు

దశాబ్దాల్లో సంభవించిన ప్రకృతి విపత్తులకు డొమెనికా దేశం అత్యంత ప్రభావితమైనట్లు జర్మన్ వాచ్ నివేదిక వెల్లడిస్తోంది. ఆ తర్వాతి స్థానాల్లో మయన్మార్, హోండురాస్, లిబియా, హైతీ, గ్రెనడా, ఫిలిప్పీన్స్, నికరాగ్వా, భారత్, బహామాస్ ఉన్నాయి.

# నవంబర్ 16న కమ్మ మహాజన సంఘం వనసమారాధన




**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం)**కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 16న జరగబోయే కార్తీక మాస వనసమారాధన ఈసారి మరింత ఘనంగా, వైభవంగా జరగనుంది. కార్యక్రమం ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. చేరుకూరి వారి మామిడి తోటలో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో సంఘ అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము ఈ వివరాలు వెల్లడించారు వనసమారాధన ప్రధాన లక్ష్యం సమాజంలో బంధుత్వం, ఏకతా భావం, పరస్పర అవగాహన పెంపొందించడం అని వారు తెలిపారు ఈ కార్యక్రమం మన సమాజ ఐక్యతకు ప్రతీక. కుటుంబాలు, పిల్లలు, మహిళలు, యువత అంతా కలిసి ఆనందం పంచుకునే వేదికగా వనసమారాధన నిలుస్తోంది అని పేర్కొన్నారు ఈ ఏడాది వనసమారాధనలో భక్తి కార్యక్రమాలు, దేవతారాధనలు, పిల్లల గేమ్స్, మహిళల కోసం ప్రత్యేక పోటీలు, వంటల పోటీలు, ఫ్యాన్సీ డ్రస్ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, తెలుగు సంప్రదాయ కళలను ప్రతిబింబించే వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదనంగా, సినీ కళాకారుల సంగీత విభావరి, కబడ్డీతో పాటు పలు క్రీడా పోటీలు కూడా ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి తెలంగాణ సంస్కృతి, మట్టి వాసన ప్రతిబింబించేలా వేదిక అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించామని వారు తెలిపారు. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో సభ్యులు, శ్రేయోభిలాషులు, మహిళలు, యువత ఈ వనసమారాధనలో పాల్గొనబోతున్నారని వివరించారు ఈ మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి ఎమ్మెల్సీ తాత మధు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకుల్ల నీరజ గిద్దంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు వంటి పలువురు ప్రజా ప్రతినిధులు, సంఘ పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు

కమ్మ మహాజన సంఘం కేవలం సామాజిక వేదిక మాత్రమే కాదు, సేవా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను ముందుకు తీసుకెళ్తున్న కుటుంబం. వనసమారాధన మన సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. పిల్లలకు వినోదం పెద్దలకు ఆధ్యాత్మిక స్ఫూర్తి, మహిళలకు గుర్తింపు కలిగించేలా కార్యక్రమాలు ఉంటాయి అని కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము తెలిపారు మీడియా సహకారం వల్ల సంఘ కార్యకలాపాలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరుతున్నాయని, ఈ సత్సమాజ కార్యక్రమాన్ని అందరికీ చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో విలువైనదని వారు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సంఘ ప్రతినిధులు తెలిపారు.

నవంబర్ 16న జరగబోయే ఈ వనసమారాధనలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక బంధం ఉట్టిపడేలా కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు కార్యక్రమంలో సంఘ నాయకులు నున్నా మాధవరావు చిరుమామిళ్ల నాగేశ్వరరావు, మందడపు రామకృష్ణ కొత్తపల్లి నీరజ వై వి, బత్తిని నాగప్రసాద్ కేతినేని హరీష్ కొల్లి వెంకటేశ్వరరావు గరికపాటి వెంకట్రావు రావూరి సైదుబాబు దిరిశాల వెంకటేశ్వరరావు నున్నా నవీన్ పోటు శరత్ కమ్మ మహాజన సంఘం సంఘం వైస్ ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు కోశాధికారి తుళ్లూరి నిర్మలాకుమారి కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి నంబూరి సత్యనారాయణప్రసాద్ డా. పోతినేని భూమేశ్వర్ రావు నల్లమల ఆనంద్ కోలేటి నవీన్ తాళ్ళూరి మురలీకృష్ణ, బండి రవికుమార్ తదితర సంఘ పెద్దలు ప్రముఖులు పాల్గొన్నారు

# జోగిపేట మెయిన్ రోడ్ లో మొబైల్ షాప్ ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ఆందోల్-జోగిపేట,మున్సిపల్ కేంద్రం మెయిన్ రోడ్ లోని, శ్రీ మహాత్మా బసవేశ్వర చౌరస్తా వద్దగల, ఏ వన్ టెలిఫోన్ మొబైల్ షాప్ లో, చింతల రాజ మల్లయ్య ఫర్టిలైజర్ షాపులో, నిన్న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు, షాపుల యొక్క తాళాలు బద్దలు కొట్టి, దాదపు నాలుగు లక్షల విలువైన మొబైల్స్, నగదు, దొంగిలిచ్చినట్టు, తెలిపారు, ఎరువుల దుకాణం షట్టర్ బద్దలు కొట్టి, దాదాపు 20,వేల, రూపాయల నగదు, దొంగిలిచినట్టు యజమానులు తెలిపారు, ఈ విషయమై జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఫిర్యాదు మేరకు, వేలిముద్ర నిపుణులను పిలిచి, కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్టు జోగిపేట పోలీసులు తెలియజేశారు...

# రాజన్న భక్తులను మోసం చేసిన ఆటో డ్రైవర్. 2.5 తులాల బంగారం, 2000 నగదు చోరీ.



వేములవాడ టౌన్, (ప్రజాబలం), కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన దేవుపల్లి బుధవ్వ మరియు ఆమె భర్త చంద్రయ్య బుధవారం రోజు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చినారు. దంపతులు దైవ దర్శనం అనంతరం నాంపల్లి దేవాలయానికి దర్శనానికి వెళ్లడానికి వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుండి ఆటోలో ఎక్కి నాంపల్లి వైపు వెళుండగా, అట్టి ఆటో డ్రైవర్ మరియు మరొక వ్యక్తి నాంపల్లి వైపు కాకుండా మరోవైపు ఆటోను తీసుకువెళ్లి వారిని చంపుతామని బెదిరించి బుధవ్వ మెడలోని 2.5 తులాల బంగారు పుస్తెలతాడు మరియు 2000 రూపాయలు లాక్కొని పారిపోయినారు. ఇట్టి దరఖాస్తు పై కేసు నమోదు చేయడం జరిగింది. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై రామ్మోహన్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం సంగారెడ్డి లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి మాట్లాడుతూ ఈనెల 12 నుండి 19 వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు జరుగుతాయని తెలియజేశారు ఈ ఉత్సవాలలో సీనియర్ సిటిజన్స్ అందరూ పాల్గొనాలని తెలియజేశారు తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007, సీనియర్ సిటిజన్ కొరకు ఏర్పాటు చేయబడిందని తెలియజేశారు. ఈ సంక్షేమ చట్టం గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలి అందరికీ తెలియజేయాలని కోరారు. సమాజంలో తల్లిదండ్రులు పిల్లల వలన ఎదుర్కొంటున్న సమస్యల కొరకు వృద్ధుల పోషణ మరియు సంరక్షణ కొరకు ప్రత్యేకమైనటువంటి టోల్ ఫ్రీ నెంబం14567 ఏర్పాటు చేయబడింది ఈ టోల్ ఫ్రీ నెంబర్ ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ సూర్య రావు, వయో వృద్ధుల, దివ్యాంగుల శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, వయోవృద్ధులు మరియు దివ్యాంగులు,ట్రాన్స్ జెండర్స్ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్,జిల్లా బాలల సంరక్షణ అధికారి రత్నం కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా సహిష్ట, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు విజయ రావు, అశోక్ కుమార్ సంగయ్య కృష్ణ సత్తయ్య నరసింహారెడ్డి, ఖాదర్ మైనుద్దీన్ పాల్గొన్నారు

# సంగారెడ్డిలో ఐక్యత మార్చ్...




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో ఐక్యత మార్చ్ ఘనంగా జరిగింది. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని "మై భారత్" సంస్థ సమన్వయంతో ఐబి నుండి కలెక్టరేట్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించారు.ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య,అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'వందేమాతరం 'జైహింద్' నినాదాలతో నగరం మార్మోగింది,తరువాత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమాన్ని ఎంపీ రఘునందన్ రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.



వందేమాతరం గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది,ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ తో పాటు దేశానికి స్వాతంత్రం సిద్ధించిన 100వ సంవత్సరం 2047 వరకు భారత దేశాన్ని విశ్వ గురువుగా నిలపాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు . సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక. ఆయన చూపిన మార్గంలో యువత నడవాలి అన్నారు. స్వాతంత్రం వచ్చిన సమయంలో భారతదేశ 536 సంస్థానాలతో చిన్న చిన్న ముక్కలుగా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం ఉండి ప్రత్యేక రాజ్యాలుగా ఉండేదని ఆ సంస్థానాలన్నిటిని భారతదేశంలో విలీనం చేసిన మహనీయుడు అఖండ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు,అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనమైనప్పటికీ మన హైదరాబాద్ సంస్థానం తోపాటు కాశ్మీర్ భారతదేశంలో విలీనం కాలేదని అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం కోసం ఆపరేషన్ పోలో నిర్వహించి 1948 సెప్టెంబర్ 17వ తేదీన భారతదేశంలో హైదరాబాద్ సంస్థనాన్ని విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందన్నారు. సంస్థానాల విలీనం ద్వారా అఖండ భారతావని నిర్మించిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందని అన్నారు. భారతదేశాన్ని ఐక్యంగా, శక్తివంతంగా నిలబెట్టడం మనందరి బాధ్యత అని అన్నారు. దేశ సమైక్యత వెనుక పటేల్ లాంటి మహనీయుల త్యాగాలు ఉన్నాయని, ఆయన స్ఫూర్తిని ఆచరణలో పెట్టి యువత దేశ సేవలో ముందుండాలని ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు పిలుపునిచ్చారు,జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూలి సర్దార్ పటేల్ దేశ ఏకతకు, సామాజిక సమగ్రతకు చేసిన కృషి అపూర్వం. ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, జాతీయ సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకుంటూ, ప్రభుత్వ అధికారులు ఆయన స్ఫూర్తిని తమ కర్తవ్యాల్లో ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. 1947లో దేశాన్ని ఏకం చేసిన సర్దార్ పటేల్ స్ఫూర్తిని ప్రతి భారత పౌరుడు ఆయన చూపిన మార్గం నేటి తరానికి మార్గదర్శకమని, అధికారులు ప్రజల్లో దేశభక్తి, ఐక్యతా భావాన్ని నింపేందుకు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు,యువతలో దేశభక్తిని పెంపొందించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఏక్ బారత్ ఆత్మనిర్బార్ భారత్ పేరట ఈ యూనిటీ మార్చి కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.దేశ సమగ్రత కోసం భావితరాల కు స్వతంత్ర సంగ్రామంలో మహనీయులు చేసిన కృషిని తెలియజెప్పడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దూకదం చేస్తాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వం" భారతదేశ బలమని, మన అందరం ఈ దేశానికి వరమని గుర్తిస్తూ సమైక్యతతో ముందుకు సాగాలన్నారు,ఈ కార్యక్రమ సమన్వయకర్తగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎం.రంజిత్ రెడ్డి, జిల్లా యువజన అధికారి,భారత్ గోల్. జిల్లా యువజన అధికారి ఖాసీం బేగ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలోట్రైనీ కలెక్టర్లు దీపికా, ప్రతిభ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ,వివిధ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగూరు గురుకులంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** పుల్కల్ మండల పరిధిలోని, సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలను, మంగళవారం నాడు, జిల్లా కలెక్టర్ పి,ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు, గురుకుల పాఠశాలలో విద్యార్థులు తాగడానికి, నీరు సరిగా ఉందా లేదా, త్రాగే నీరు చుట్టూ పరిశుభ్రంగా ఉందా లేదా, పాఠశాల చుట్టూ పరిశుభ్రత ఉందా లేదా అని, ఆవరణ చుట్టూ తనిఖీ చేశారు, పాఠశాల బాగోగులు చూసుకునే ప్రిన్సిపాల్, విద్యార్థులతో ఎలా ఉన్నాడో, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, హాస్టల్ ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారంటే, పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు, హాస్టల్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాసిరకం భోజనం అందించడం సరికాదన్నారు, అనంతరం స్టోర్ రూమ్ ను పరిశీలించారు, నిత్యవసర వస్తువులను కలెక్టర్ ప్రావీణ్య, క్షుణ్ణంగా పరిశీలించారు, నాసిరకం సరుకులతో విద్యార్థులకు భోజనం పెట్టడం ద్వారా, ఆహారాన్నితిన్న విద్యార్థులు అనారోగ్యానికి గురి అవుతారని , కావున విద్యార్థులకు, నాణ్యమైన సరుకులతో కూడిన భోజనం పెట్టాలని అన్నారు, పలు రికార్డులను పరిశీలించిన అనంతరం, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రతిరోజు శానిటైజర్ చేయడం, ఇలా రోజుకు ఒక కార్యక్రమం పెట్టుకుంటే, గురుకుల పాఠశాల పరిశుభ్రంగా ఉంటుందన్నారు, సింగూర్ గురుకుల పాఠశాలకు, పుల్కల్ తహసిల్దార్, అవాంతరం వారానికి ఒకరోజు గురుకుల పాఠశాలను, పుల్కల్ తహసిల్దార్ వంశీకృష్ణ, పర్యవేక్షించాలన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్డీవో, పుల్కల్ తహసిల్దార్ కృష్ణ, ఆర్ఐ,దావూద్, ఏవో చైతన్య, ఏ ఈ ఓ అంజుమ్, సీఈఓ నాగయ్య, సింగూర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు....

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అందుకోవాలి.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

బుధవారం రోజున వేములవాడ మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల గురించి, మరియు విద్య యొక్క ప్రాముఖ్యత, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందనతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ముఖ్యంగా ఆడపిల్లలను కచ్చితంగా చదివిపించాలన్నారు. ఎవరిని కూడా వ్యవసాయ పనులకు గాని, ఇతరాత్ర పనులకు పంపించకూడదని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికి అయినా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అలాగే అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు.

విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రాముఖ్యత, పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలలు,రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ తెలిపారు.

రెసిడెన్షియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40% డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్ చార్జీలకు పెంచామని తెలిపారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మెనూ ప్రవేశపెట్టమని తెలిపారు.

నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో నియమించామని తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేశామని అన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొని వస్తున్నామని, ఐటిఐ కళాశాలలను రతన్ టాటా కంపెనీతో అనుసంధానం చేసుకొని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామని తెలిపారు.

200 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 20 నుంచి 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోడ్డి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, ఏ సి డి పి ఓ సుచరిత, కేజీబీవీ కోఆర్డినేటర్ పద్మజ, సూపర్వైజర్ శంకరమ్మ, ఎల్సిపిఓ అంజయ్య, మరియు కేజీబీవీ ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది, ఐసిపిఎస్ చైల్డ్ లైన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ముందస్తు సమాచారం లేకుండా రాజన్న దర్శనాలు నిలిపివేత.

## అయోమయంలో రాజన్న భక్తులు.

## తీవ్రంగా స్పందించిన వేములవాడ బిజెపి పట్టణ శాఖ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వేకువ జమున భక్తులకు రాజన్న ఆలయ అధికారులు పెద్ద షాకిచ్చారు. రాజన్న భక్తులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే బుధవారం వేకువజాము నుండి రాజన్న ఆలయ అధికారులు రాజన్న స్వామి దర్శనాలను నిలిపివేశారు. దీనితో రాజన్న భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుండి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ కుటుంబ సభ్యులతో వేములవాడ రాజన్న దర్శనాలకు వస్తే భక్తులకు ఆలయ అధికారులు ఆలయ ప్రధాన ద్వారం వద్దనే నిలిపివేశారు.



ఆలయ ప్రధాన గేటుకు తాళం వేసి, అట్టి గేటుకు అడ్డంగా ఇనుప రేకులు ఏర్పాటుచేసి అక్కడ ఎస్పీఎఫ్ పోలీసులచే కాపలా ఏర్పాటు చేసినారు. ఎస్పీఎఫ్ సిబ్బంది మరియు ఆలయ అధికారులు భక్తులకు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీనితో రాజన్న భక్తులు ఆందోళనకు దిగారు. రాజన్న ఆలయ పునర్నిర్మాణం మరియు అభివృద్ధి పనులు కొనసాగుతున్న క్రమంలో రాజరాజేశ్వర స్వామి దర్శనాలు తాత్కాలికంగా మూసివేసినట్లు ఆలయ అధికారులు చావు కబురు చల్లగా తెలిపారు.



భక్తుల నిరసనల మధ్య ఆలయ అధికారులు నిద్రమత్తు వదిలి భక్తుల సౌకర్యార్థం రావిచెట్టు ఎదురుగా తూర్పు వైపు ఆలయ ప్రాంగణంలో ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటుచేసి స్వామివారి దర్శనాలకు భక్తులకు అనుమతించినారు. రాజన్న ఆలయ అధికారుల తీరుపై భక్తులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. రాజన్న దర్శనాలు కల్పించడం లేదని ముందస్తు సమాచారం ఇస్తే భక్తులు వ్యయ ప్రయాసాలకోర్చి సమయాన్ని వృధా చేసుకుని ఇంత దూరం వచ్చే వారం కాదని భక్తులు రాజన్న ఆలయ అధికారులపై మండిపడ్డారు. రాజన్న ఆలయం మూసివేతపై తీవ్రస్థాయిలో స్పందించిన బిజెపి నేతలు.

ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే బుధవారం అర్ధరాత్రి నుండి రాజన్న ఆలయ దర్శనాలు నిలిపివేయాల్సిన అవసరం ఏంటని వేములవాడ బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ దేవాలయ అధికారులను సూటిగా ప్రశ్నించారు. వేములవాడ రాజన్న ఆలయం మూసివేత నేపథ్యంలో వేములవాడ బిజెపి సీనియర్ నాయకుడు ప్రతాప్ రామకృష్ణ ఆలయం ముందు బుధవారం నాడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధికి బిజెపి పార్టీ వ్యతిరేకం కాదని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆలయం మూసివేస్తే ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ అనేక కుటుంబాలు రోడ్డున పడతాయి అన్నారు. రాజన్న ఆలయంలో ముందుగా ఆలయంలోని దర్గాను తొలగించిన తర్వాతనే దేవత మూర్తుల విగ్రహాలను ముట్టుకోవాలని ఆయన హెచ్చరించారు. రాజన్న దర్శనాల నేపథ్యంలో భక్తులకు, వేములవాడ పట్టణ ప్రజలకు స్పష్టమైన ప్రకటన ఇవ్వాల్సిన ఆవశ్యకత అధికారులకు లేదా అంటూ ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో రేకుల రాజకుమార్, మెరుగు లక్ష్మణ్, అన్నం నరసయ్య, పిన్నింటి హనుమాన్లు, నామాల శేఖర్, కొన్నాల రఘుపతి, నేరెళ్ల సాయి, గుడిసె మనోజ్, లాల శేఖర్, సగ్గు రాహుల్, గుంటి కనకయ్య, జవ్వాజి శేఖర్, డాక్టర్ వెంకన్న, నేరెళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన డిఐఈఓగా సిహెచ్ శరత్ కుమార్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంటర్ విద్యాధికారి గా ప్రస్తుతం పనిచేస్తున్న వై. శ్రీనివాస్ ఆన్ డ్యూటీ పైన ఇంటర్మీడియట్ బోర్డుకి బదిలీ కావడంతో వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న సిహెచ్. శరత్ కుమార్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంటర్ నూతన విద్యాధికారిగా నియమించడం జరిగింది. ఆయన బుధవారం రోజున బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు, మరియు వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# 150 కోట్లతో వేములవాడ రాజన్న ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి.

## రాజన్న భక్తుల, ప్రజల ఆలోచనకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి.

## రాజన్న ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి.

## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న భక్తుల, ప్రజల ఆలోచనకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి చేస్తున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులను బుధవారం రోజున ఆయన ఆకస్మాత్తుగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అధికారుల నుండి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకొని అవసరమైన నిధులను మంజూరు చేశారని తెలిపారు.

శృంగేరి జగద్గురు విధుశేఖర భారతి స్వామి సూచనల మేరకు ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇటీవల జగద్గురు విధిశేఖర భారతి స్వయంగా రాజన్న ఆలయాన్ని సందర్శించి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. రాజన్న ఆలయ పునర్నిర్మాణ పనుల కారణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భీమేశ్వర ఆలయంలో అర్జిత సేవల కోసం తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. స్వామి వారి కళ్యాణం, కోడె మొక్కులు, కుంకుమ పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, వంటి అన్ని సేవలు భీమేశ్వర ఆలయ పరిసర ప్రాంతాలలో నిర్వహించేలా ఏర్పాటు చేసినట్లు వివరించారు.



ప్రజల, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి జరుగుతుందని, అందరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.రాజన్న భక్తులు, వేములవాడ ప్రజలు, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

## టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/టీజీ ఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి బుధవారం కొండాపూర్, గొల్లపల్లి లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో పాటు అలియాబాద్ లో రూ 20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం - గత పదేళ్ల లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు- రైతులకు ఒకే సారి రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ ది - ఆరు గ్యారెంటీలలో బాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం తో పాటు 200 యూనిట్స్ ఉచిత విద్యుత్, రూ 500 కే సిలిండర్ ను అందించడం జరుగుతుంది.ప్రభుత్వం రేషన్ షాప్ ల ద్వారా ప్రతి ఇంటికి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుంది.-



కొనుగోలు కేంద్రాలలో ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అని అన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com